1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

THE POWER OF PEN

సంపుటి : 2 సంచిక : 178 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 22 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 178 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 22 May 2025 PAGES : 8 PRICE : 3/-

# ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్పవరం యోగా

జూన్ 21న వరల్డ్ యోగా డే

విశాఖ ఆర్కే బీచ్ లో 5 లక్షల మందితో కార్యక్రమం

హాజరవుతున్న ప్రధాని మోదీ

యోగాంధ్ర వెబ్ సైట్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 21)

ప్రపంచానికి భారతదేశం అందిస్తున్న గొప్ప వరం యోగా అని, యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సీఎం చంద్రబాబు అన్నారు. యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారని చెప్పారు. నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తామన్నారు. జూన్ 21న ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకూ 5 లక్షలమందితో కార్యక్రమం జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా యోగాంధ్ర వెబ్ సైట్ ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

**యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఘనతే మోదీదే :** యోగా అనేది మన దేశానికి వారసత్వంగా వస్తోంది. భారతీయ జీవన విధానంలో ఒక భాగం. దీనికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చింది ప్రధాని మోదీయే. ఒకప్పుడు ప్రపంచంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చి మన దేశంలో చదువుకునేవారు. రానురాను విదేశీ దాడులతో అంతా కనుమరుగైంది. మళ్లీ ఇప్పుడు యోగా విలువ ప్రపంచానికి తెలిసేలా ప్రధాని మోదీ చేశారు. 2014 డిసెంబర్ లో యునైటెడ్ నేషనన్ జనరల్ అసెంబ్లీ ఆమోదించి ప్రపంచమంతా యోగా దినోత్సవం జరపాలని నిర్ణయించింది.

యోగా అనేది ఒక ప్రాంతానికో, ఒక మతానికో సంబంధించినది కాదు. మనిషి జీవితంలో మెరుగైన జీవన ప్రమాణాలకు నాంది యోగా. నేటి ఆధునిక యుగంలో అందరూ పరుగులు పెడుతున్నారు. టెక్నాలజీతో ఒత్తిడికి గురవుతున్నారు. ప్రతి దానికీ టెన్షన్ పడుతున్నారు. లైఫ్ మెకానికల్ గా మారుతోంది. వీటన్నంటిని నుంచి ఉపశమనం రావాలంటే యోగా ఒక్కటే మార్గం.

**ఏపీ చరిత్రలో నూతన అధ్యయనం :** రికార్డు సృష్టించేలా నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తాం. ఫోటోల కోసమో, ఈవెంట్ల కోసమే చేసే కార్యక్రమం కాదు. నెల మొత్తం పలు కార్యక్రమాలు నిర్వహించి యోగాపై ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించాం. విశాఖ ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 5 లక్షల మందితో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తాం. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్లమందికి తగ్గకుండా కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 10 లక్షలమందితో యోగా కోర్సులు చేయించి వారికి సర్టిఫికెట్లు కూడా అందజేయాలని నిర్ణయించాం. సముద్రం పక్కన ఇలాంటి యోగా నిర్వహించడం అరుదైన విషయం. సముద్ర తీరాన, ప్రకృతి ఒడిలో జరిగే ఈ కార్యక్రమం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

**యోగాపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తాం :** జూన్ 21న యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతున్నందున మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలోని మంత్రుల బృందం దిశానిర్దేశం చేస్తుంది. పలు యూనివర్సిటీలు, పబ్లిక్, ప్రైవేటు సంస్థల్లోని వాలంటీర్లు, మహిళలు, వృద్ధులు, పోలీసులు, ఉద్యోగులు యోగా దినోత్సవంలో భాగస్వాములు కావాలి. అలాంటివారికి ధ్రువపత్రాలు కూడా అందజేస్తాం. పట్టణాలు, నగరాల నుంచి గ్రామస్థాయి వరకూ యోగాభ్యాసన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. -మిగతా 2లో

## దుర్బలులపై శ్రద్ధ చూపితేనే.. ప్రపంచ ఆరోగ్యం సాధ్యం: మోదీ

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 21)

ప్రపంచ ఆరోగ్యం అత్యంత దుర్బలులపై మనం చూపే శ్రద్ధపైన ఆధారపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆరోగ్యకరమైన భావి ప్రపంచం కలుపుకొనిపోవడం, సమగ్ర దృష్టి, సహకారంతోనే సాధ్యమని చెప్పారు. నేడు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లకు భారతదేశ విధానాలు స్థిరమైన ప్రత్యామ్నాయ నమూనాలు చూపగలవన్నారు. జెనీవాలో జరుగుతున్న 78వ 'ప్రపంచ ఆరోగ్యసభ' సదస్సును ఉద్దేశించి మంగళవారం వీడియో సందేశం ద్వారా ప్రధాని మాట్లాడారు. ఈ ఏడాది ఇతివృత్తమైన 'ఆరోగ్యం కోసం ఒకటే ప్రపంచం' గురించి చెబుతూ ఇది ప్రపంచం పట్ల భారతదేశ దార్శనికతకు అనుగుణంగా ఉందన్నారు. భారతదేశ ఆరోగ్య సంస్కరణల్లో కలుపుకొనిపోవడం ప్రధానమైనదిగా పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్యబీమా పథకం 'ఆయుష్మాన్ భారత్' 58 కోట్లమందికి ఉచిత చికిత్సలు అందుతున్నట్లు తెలిపారు. 70 ఏళ్లు దాటిన భారతీయులు అందరికీ వర్తించేలా ఇటీవలే దీన్ని విస్తరించామన్నారు. భారత్‌లో వేలాది ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాల -మిగతా 2లో



## బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటా

టీడీపీ కార్యకర్తలే పార్టీకి బలమన్న మంత్రి లోకేశ్

మృతిచెందిన నేత బాలకోటిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని హామీ

ఉండవల్లి నివాసంలో బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులతో లోకేశ్ భేటీ

హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి

ఆర్థిక సాయంతో పాటు, ఇంటి తాకట్టు విడిపిస్తానని లోకేశ్ హామీ

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 21)

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలని, వారి సంక్షేమానికి తాను పెద్దన్నలా అండగా ఉంటానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పునరుద్ఘాటించారు. పార్టీ కోసం అహర్నిశలు పాటుపడే కార్యకర్తల బాగోగులు చూడటం తన బాధ్యత అని ఆయన -మిగతా 2లో



## కేంద్రం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన వైఎస్ షర్మిల

కార్మికులను తొలగిస్తే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరిక

కేంద్రం కుట్రపూరితంగా ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతోందని ఆరోపణ

రూ.11 వేల కోట్ల సాయం పేరుతో మోసం జరిగిందని విమర్శ

రాష్ట్ర ప్రభుత్వం, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తీరుపై తీవ్ర అసంతృప్తి

అదానీ కోసమే స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజం



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 21)

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికులను తొలగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ అమ్మేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. కార్మికులను తొలగిస్తూ, ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని, దీనిని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే -మిగతా 2లో

## పాక్‌పై చిన్నపాటి యుద్ధమన్న ఖర్గే.. మండిపడిన భాజపా

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 21)

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పహల్గాంలో భద్రత కల్పించకపోవడం వల్లే అక్కడ దారుణ ఘటన చోటుచేసుకుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ ఉగ్రదాడికి సంబంధించి ఇంటెలిజెన్స్ నివేదిక అందిన తర్వాతే కశ్మీర్ పర్యటనను ప్రధానిరద్దు చేసుకున్నారని మరోసారి పేర్కొన్నారు. వివిధ దేశాలకు పార్లమెంటు సభ్యుల బృందాన్ని పంపిస్తుండటంపై మాట్లాడిన ఆయన.. దీనికి సంబంధించి తమ పార్టీని ప్రభుత్వం సంప్రదించలేదని విమర్శించారు.



**చిన్నపాటి యుద్ధం..!**

"పహల్గాంలో కేంద్ర ప్రభుత్వం భద్రత కల్పించకపోవడం వల్లే 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడికి వెళ్లిన పర్యాటకులకు పోలీసులు, సరిహద్దు దళం లేదా సైన్యం సెక్యూరిటీ కల్పించలేదు. అంతమంది చనిపోయినా.. భద్రతా వైఫల్యంపై ప్రధాని మోదీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు" అని ఖర్గే పేర్కొన్నారు. కర్ణాటక ప్రభుత్వం -మిగతా 2లో

## అది మోదీ అప్పటికప్పుడు చేసిన ఆలోచన

జైరాం రమేశ్ ఆరోపణలు




## మూడు అఖిలపక్ష బృందాలతో మిస్రీ భేటీ

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 21)

పలు అంశాలపై అవగాహన కల్పించిన విదేశీ వ్యవహారాల కార్యదర్శి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత్ ఎంచుకున్న బలమైన విధానాన్ని ప్రపంచ దేశాలకు వివరించేందుకు ఏర్పాటైన అఖిలపక్ష ప్రతినిధి బృందాలకు విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ పలు అంశాలను వివరించారు. దేశంలో పాకిస్థాన్ ప్రేరేపించిన ఉగ్రదాడుల వివరాలను తెలియజేయడంతోపాటు దాడులకు బాధ్యులైన సూత్రధారులను శిక్షించాలన్న భారత దృఢ నిశ్చయాన్ని విశదీకరించారు. వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు, -మిగతా 2లో



## భయపెట్టి పాలించాలనుకుంటున్నారు...

మద్యం కుంభకోణం జరగలేదు: మిథున్ రెడ్డి

ఏపీలో అరాచక పాలన సాగుతోందన్న ఎంపీ మిథున్ రెడ్డి

ఇంటింటికీ రేషన్ వాహనాల రద్దు సరికాదని వ్యాఖ్య

సంక్షేమ పథకాలు ఆపారని ఆగ్రహం



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 21)

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పరిపాలించాలనుకోవడం అవివేకమని ఆయన మండిపడ్డారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగిన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రభుత్వ తీరును తప్పుబడుతూ మిథున్ రెడ్డి పలు కీలక ఆరోపణలు చేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నిలిపివేయడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, ప్రజల దృష్టిని మరల్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనాలను రద్దు చేయడం సరైన చర్య కాదని హితవు పలికారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి మద్యం కుంభకోణం జరగలేదని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కట్టుకథలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, మద్యం కుంభకోణం జరిగిందంటూ దుష్ప్రచారం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న ప్రచారమేనని కొట్టిపారేశారు.అనంతపురం జిల్లాలో గ్రామీణాభివృద్ధికి సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సంస్థకు అందే -మిగతా 2లో

మొదటిపేజీ తరువాయి

## ప్రపంచానికి భారత్ అందిస్తున్న
# గొప్పవరం యోగా

ప్రధాని మోదీ ప్రపంచమంతా యోగాను ప్రమోట్ చేస్తున్నప్పుడు మనకూ బాధ్యత ఉంటుంది కదా. ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియా కూడా చొరవ తీసుకుని యోగాను ప్రమోట్ చేయాలి. మంచి కంటెంట్ తో ఆర్టికల్స్ రాయాలి. మంచి వీడియోస్ తయారుచేయాలి. మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగాతో అసోసియేట్ చేసుకుని 2 వేలమంది యోగా శిక్షకులను తయారుచేస్తాం. యోగా ప్రాముఖ్యత తెలిపేలా స్కూల్ సిలబస్ లో పెడతాం.

**ఆరోగ్యమే మహాభాగ్యం**

అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషమే స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యం. మన సమస్యలకు చక్కటి పరిష్కారం యోగా. అందరూ రోజూ ఒక గంట ప్రాణాయామం, ఆసనాలు, మెడిటేషన్ చేయాలి. వీటిని ప్రాక్టీస్ చేస్తే ఒత్తిడి మాయమై పనిని ఎంజాయ్ చేస్తారు. యోగా కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈషా, పతంజలి, బ్రహ్మ కుమారీస్ ఇలాంటి అసోసియేషపోలు దేశవ్యాప్తంగా పనిచేస్తున్నాయి. వీరితో నేను ఎన్నో ఏళ్లుగా అసోసియేట్ అవుతున్నారు. అప్పట్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్, ఈషా సద్గురు వాసుదేవ్ తో ఐఏఎస్ , ఐపీఎస్, మంత్రులకు నేను క్లాసులు పెట్టించాను. బ్రహ్మకుమారీస్ ప్రపంచమంతా యూనిట్లు పెట్టారు... అని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఈ మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# దుర్బలులపై శ్రద్ధ చూపితేనే.. ప్రపంచ ఆరోగ్యం సాధ్యం: మోదీ

విస్తృత నెట్‌వర్క్ ఉందని.. క్యాన్సర్, మధుమేహం, అధిక రక్తపోటు వంటి రుగ్మతలను ముందస్తు పరీక్షల ద్వారా గుర్తించడానికి ఇవి దోహదపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే వేలాది ప్రభుత్వ ఫార్మసీలు తక్కువ ధరకు నాణ్యమైన మందులు అందిస్తున్నట్లుగా నొక్కి చెప్పారు. ఆరోగ్య వసతులను మెరుగుపరచడంలో సాంకేతికత పాత్ర గురించి చెబుతూ గర్భిణులు, పిల్లలకు టీకాలు వేయడంలో ఉపయోగపడుతున్న ప్రత్యేక డిజిటల్ ఆరోగ్య గుర్తింపు వ్యవస్థను వివరించారు. టెలీ మెడిసిన్ అనేది ఇపుడు వైద్యులకు అందరినీ చేరువ చేసిందన్నారు. భారత ఉచిత టెలీ మెడిసిన్ సేవల ద్వారా 34 కోట్ల సంప్రదింపులు జరిగినట్లుగా తెలిపారు. జూన్ నెలలో రాబోతున్న 11వ 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'ను గుర్తుచేస్తూ ఈ ఏడాది 'ఒకే భూమి, ఒకే ఆరోగ్యసమాజం కోసం యోగా' పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రపంచ దేశాలన్నీ పాల్గొనాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

# బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటా

స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలానికి చెందిన దివంగత టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి లోకేశ్ నేడు ఉండవల్లి నివాసానికి పిలిపించి పరామర్శించారు. వారి సమస్యలను సావధానంగా విన్న మంత్రి, అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కుటుంబ సభ్యుల ఆవేదన, మంత్రి హామీ

మంత్రి లోకేశ్ ను కలిసిన వెన్నా బాలకోటిరెడ్డి సతీమణి వెన్నా నాగేంద్రమ్మ, ఆయన సోదరుని కుమారులు వెన్నా నరసింహారెడ్డి, వెన్నా రామకృష్ణారెడ్డి తమ గోడును వెళ్లబోసుకున్నారు. బాలకోటిరెడ్డి హత్య జరిగిన తీరును, ప్రస్తుత ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులను వారు మంత్రికి వివరించారు. హత్య కేసులో నిందితులు ఇంకా స్వేచ్ఛగా తిరుగుతున్నారని, కేసు విచారణను వేగవంతం చేసి, దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలని వారు లోకేశ్ ను కోరారు. తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఉపాధి హామీ, గృహ నిర్మాణ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, నివాసం ఉంటున్న ఇల్లు కూడా తాకట్టులో ఉందని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

స్పందించిన మంత్రి నారా లోకేశ్, వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల విడుదలకు కృషి చేయడంతో పాటు, పార్టీ తరపున ఇంటి తాకట్టును విడిపిస్తానని మాట ఇచ్చారు. హత్య కేసు నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో దాడులను ఎదుర్కొని నిలిచిన అంజిరెడ్డి తాత, మంజులారెడ్డి, తోట చంద్రయ్య వంటివారే మనకు స్ఫూర్తి. మీ కుటుంబానికి ఇంటి పెద్దకొడుకుగా నేను బాధ్యత తీసుకుంటాను" అని వారికి ధైర్యం చెప్పారు. మంత్రి లోకేశ్ తమకు అండగా నిలవడం పట్ల బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

**బాలకోటిరెడ్డి సేవలు, హత్యోదంతం**

అలవాల గ్రామానికి చెందిన వెన్నా బాలకోటిరెడ్డి సుమారు నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో, అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అండదండలతో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు ఇంట్లో నిద్రిస్తున్న బాలకోటిరెడ్డిని తుపాకీతో కాల్చి చంపినట్లు ఆరోపణలున్నాయి. ఈ హత్యకు ఆరు నెలల ముందు కూడా ఆయనపై కత్తులతో దాడికి విఫలయత్నం జరిగింది. తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు గతంలో తెలిపారు.

# కేంద్రం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు

ప్రాణత్యాగానికైనా సిద్ధమని ఆమె స్పష్టం చేశారు. 'ఆంధ్రుల హక్కు - విశాఖ ఉక్కు' నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ మరోసారి బలంగా వినిపిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే స్టీల్ ప్లాంట్ స్థాపించబడిందని, ఆ సమయంలో లాభాల బాటలో నడిచిందని వైఎస్ షర్మిల గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే "కుక్కను చంపాలంటే దాన్ని పిచ్చిది చేయాలి" అన్న చందంగా ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆమె ఆరోపించారు. ఇందులో భాగంగానే ఉద్యోగాలను తొలగించడం, ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకు అందకుండా చేయడం, సొంత గనులు కేటాయించకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను ఉద్ధరించేందుకు రూ.11 వేల కోట్లు ఇచ్చిందన్న ప్రచారం పూర్తిగా అబద్ధమని, ఇచ్చినట్లే ఇచ్చి అందులోంచి రూ.8 వేల కోట్లను బ్యాంకు రుణాల కింద వెనక్కి తీసుకున్నారని ఆమె వివరించారు. మిగిలిన రూ.3 వేల కోట్లు ఇవ్వాలంటే ఏకంగా 5 వేల మంది ఉద్యోగులను తొలగించాలని షరతు పెట్టారని, ఇది ప్లాంట్‌ను అదానీ వంటి వారికి కట్టబెట్టే కుట్రలో భాగమేనని షర్మిల ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని వైఎస్ షర్మిల మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు ఇది న్యాయంగా ఉందా అని ఆమె ప్రశ్నించారు. "ప్రధాని మోదీకి మీరు ఊడిగం చేస్తున్నారా? కార్మికులను తొలగిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? మోదీతో లాలూచీ పడ్డారా? లేక ఈ కుట్రలో మీరూ భాగస్వాములా?" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# అది మోదీ అప్పటికప్పుడు చేసిన ఆలోచన

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 21)

ప్రజల దృష్టి మరల్చడానికే అఖిలపక్ష ప్రతినిధి బృందాలను విదేశాలకు పంపుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ (%అబిరిజీబిళీ ష్టబిళీలిరీపీ%) విమర్శించారు. జవాబు చెప్పాల్సిన ప్రశ్నలను దాటవేసేందుకే అప్పటికప్పుడు ఈ ఆలోచన చేశారని వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత్ ఎంచుకున్న బలమైన విధానాన్ని ప్రపంచ దేశాలకు వివరించేందుకు వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు, మాజీ ఎంపీలతో కూడుకున్న ఏడు బృందాలను కేంద్రం విదేశాలకు పంపుతోంది. తమ అంతర్జాతీయ పర్యటనల్లో భాగంగా ఈ బృందాలు ఆయా దేశాల ప్రభుత్వాధినేతలతోపాటు పార్లమెంటేరియన్లు, మేధావులు, మీడియా సభ్యులను కలుస్తారు.

"1950 నుంచి ఐరాసలో భారత వాణి వినిపించేందుకు ప్రతి ఏడాది అక్టోబర్-నవంబర్ సమయంలో అఖిలపక్ష నేతలతో కూడిన బృందాన్ని పంపేవాళ్లం. కానీ 2014 నుంచి ఆ సంప్రదాయాన్ని నిలిపివేశారు. అయితే ప్రస్తుతం మోదీ ఇమేజ్ ప్రపంచవ్యాప్తంగా దెబ్బతినడంతో నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించారు. జవాబు చెప్పాల్సిన ప్రశ్నలను తప్పించుకోవడానికే అప్పటికప్పుడు ఈ అఖిలపక్షం ఆలోచన చేసి ఎంపీలను విదేశాలకు పంపిస్తున్నారు" అని జైరాం రమేశ్ ఆరోపణలు చేశారు.

సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ అందిస్తున్న ప్రోత్సాహాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టడానికి ఏర్పాటుచేసిన అఖిలపక్ష బృందాల్లోని పేర్లపై రాజకీయ రగడ రాజుకుంది. పేర్ల ఎంపికను పార్టీలకే వదిలేయాల్సిందని పార్టీలు అంటుండగా.. అది పూర్తిగా ప్రభుత్వ నిర్ణయమని, ఏ పార్టీకీ సభ్యుల ఎంపికకు అవకాశం ఇవ్వలేదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టంచేశారు. రిజిజు వ్యాఖ్యలు పూర్తిగా సత్యదూరమని జైరాం రమేశ్ మండిపడ్డారు. కాంగ్రెస్ సిఫార్సు చేసిన ఆనంద్ శర్మ, గౌరవ్ గొగొయ్, సయ్యద్ నసీర్ హుసేన్, అమరీందర్ సింగ్‌లలో ఆనంద్ శర్మకే ఈ బృందాల్లో చోటు దక్కింది. ఆ పార్టీ నేతలు శశి థరూర్, మనీశ్ తివారీ, అమర్ సింగ్, సల్మాన్ ఖుర్షీద్‌లను సిఫార్సు చేయకున్నా అఖిలపక్ష బృందంలో ప్రభుత్వం చేర్చింది. ఈ అంశం పైనే కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

# పాక్‌పై చిన్నపాటి యుద్ధమన్న ఖర్గే.. మండిపడిన భాజపా

ఏర్పాటై రెండేళ్లు పూర్తైన సందర్భంగా విజయనగర జిల్లాలోని హోసాపేటలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఆయన.. పాక్‌పై చిన్నపాటి యుద్ధాలు చేస్తున్నామని వ్యాఖ్యానించారు. పాక్ మనల్ని తక్కువ అంచనా వేస్తోందని, చైనా మద్దతుతో మనపై దాడులకు ప్రయత్నిస్తోందన్నారు.

**ప్రభుత్వానికి మద్దతు..**

"ఇలాంటి దాడులను దేశం ఎన్నటికీ సహించదు. ఈ విషయంలో మనమంతా ఐక్యంగా ఉన్నాం. అందుకే దేశ వ్యతిరేక శక్తులపై పోరాటానికి ప్రభుత్వానికి మద్దతు ప్రకటించాం. దేశమే ముఖ్యం. ఆ తర్వాతే మతం, కులం, మిగతావి.." అని ఖర్గే అన్నారు. అయితే, ప్రధాని పర్యటన వేళ నిఘా వర్గాలు సమాచారం అందిందని, సామాన్య పౌరులు, పేదలను మాత్రం రక్షించుకోలేకపోయామన్నారు. విదేశాలకు ఎంపీ బృందాలను పంపించే అంశంపై ప్రభుత్వం తమతో సంప్రదించలేదని, ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. అయినప్పటికీ దేశ ప్రయోజనం దృష్ట్యా తాము ఏమీ మాట్లాడలేదన్నారు. మన దేశం తరఫున మాట్లాడేందుకు కాంగ్రెస్ ఎంపీలను పంపిస్తున్నామని చెప్పారు.

**ఖర్గే వ్యాఖ్యలపై భాజపా మండిపాటు..**

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలను భాజపా ఎంపీ సంబిత్ పాత్ర తిప్పికొట్టారు. ఆపరేషన్ సిందూర్ చిన్నపాటి యుద్ధమంటూ పేర్కొనడంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భారత సైన్యం పాకిస్థాన్‌లోకి ప్రవేశించి అక్కడి స్థావరాలను ధ్వంసం చేయడమే కాకుండా 100 మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టిన విషయాన్ని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు అర్థం చేసుకోలేకపోతున్నారని విమర్శించారు.

# మూడు అఖిలపక్ష బృందాలతో మిస్రీ భేటీ

మాజీ ఎంపీలతో కూడుకున్న ఏడు బృందాలను ఏర్పాటు చేయగా వాటిలో మూడింటితో ఈ సమాచారం పంచుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. తమ అంతర్జాతీయ పర్యటనల్లో భాగంగా ఈ బృందాలు ఆయా దేశాల ప్రభుత్వాధినేతలతోపాటు పార్లమెంటేరియన్లు, మేధావులు, మీడియా సభ్యులను కలుస్తారు. "ఉగ్రవాదంపై పాకిస్థాన్ మాటల్ని భారత్ విశ్వసించిన ప్రతిసారి ఆ దేశం తన దొంగతనాన్ని తానే దర్యాప్తు చేస్తున్న నేరగాడిలా ప్రవర్తించింది" అని జేడీయూ నేత సంజయ్ ఝా అన్నారు. జపాన్, సింగపూర్, దక్షిణకొరియా, మలేసియా, ఇండోనేసియాకు వెళ్లే బృందానికి ఝా నాయకత్వం వహించనున్నారు. సంజయ్ ఝా(జేడీయూ), శ్రీకాంత్ శిందే(శివసేన), కనిమొళి(డీఎంకే) నాయకత్వం వహించనున్న బృందాల ప్రతినిధులతో మిస్రీ ఈ భేటీ నిర్వహించారు. శశిథరూర్ (కాంగ్రెస్), బైజయంత్ పాండా (భాజపా), రవిశంకర్ ప్రసాద్ (భాజపా), సుప్రియా సూలే (ఎన్సీపీ-ఎస్పీ)లు మిగిలిన నాలుగు ప్రతినిధి బృందాలకు నేతృత్వం వహిస్తారు.

**యూసుఫ్ పఠాన్ స్థానంలో అభిషేక్ బెనర్జీ**

"ఆపరేషన్ సిందూర్"పై వివిధ దేశాల్లో అవగాహన పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన అఖిలపక్ష ప్రతినిధి బృందానికి తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధిగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ సభ్యుడు అభిషేక్ బెనర్జీ ఎంపికయ్యారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ కేంద్ర మంత్రి కిరణ్ రిజుజుకు ఈ విషయాన్ని తెలియజేశారు. ఇంతకు ముందు కేంద్ర ప్రభుత్వం తృణమూల్ ఎంపీ యూసుఫ్ పఠాన్‌ను ఈ బృంద సభ్యునిగా ఎంపిక చేసింది. అఖిలపక్ష ప్రతినిధి బృందంలో తమ పార్టీ ప్రతినిధిగా ఎవరుంటారన్నది కేంద్రం నిర్ణయించకూడదని మమతా బెనర్జీ ప్రకటించిన నేపథ్యంలో యూసుఫ్ పఠాన్ వైదొలగారు.

# భయపెట్టి పాలించాలనుకుంటున్నారు...

విదేశీ నిధులను నిలిపివేయడం దుర్మార్గమైన చర్య అని మిథున్ రెడ్డి అన్నారు. దీనివల్ల ఎంతోమంది పేదలకు అందే సాయం ఆగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు లైనింగ్ పనుల విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన సూచించారు. ఈ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తగవని అభిప్రాయపడ్డారు.

# కొత్త రేషన్ కార్డులకు క్యూ కట్టిన లబ్దిదారులు



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 21)

ఈ నెల 7 నుంచి కూటమి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో సచివాలయనకి జనం బారులు తీరారు. ఇప్పటివరకు 96 మంది కొత్త రేషన్ కార్డుకి దరఖాస్తు చేసుకున్నట్లు కొండపి ఎమ్మార్వో మురళి తెలిపారు. రేషనకార్డులు కుటుంబ సభ్యుల తొలగింపు చేర్పులు, మార్పులు కొండపి మండల సచివాలయాల పరిధిలోని గ్రామాల వారు ఎవరైనా ఉంటే సచివాలయంలో అప్లై చేసుకున్న వారికి త్వరలోనే కొత్త రేషన్ కార్డులు మంజూరవుతాయని ఎమ్మార్వో మురళి విజ్ఞప్తి చేశారు.

# సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండండి

## ఆరోగ్యాన్ని కాపాడుకోండి
## డాక్టర్ అనూష పిలుపు



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 21)

వాతావరణ మార్పుల్లో కారణంగా కొండపి మండలంలోని ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని జలుబు ,జ్వరము ,దగ్గు ఏమైనా ఉంటే స్థానిక హెల్త్ కేర్ సెంటర్లో పేరు నమోదు చేసుకునని కావల్సిన ఉచిత మెడికల్ టెస్టులు చేపించుకొని రోగాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని పెట్లూరూ డాక్టర్ అనూష తెలిపారు. హాస్పటల్‌కి రాలేనివారు ఆశా వర్కర్లు, ఎన్ఎంలు హాస్పటల్ సిబ్బందికి తెలియచేసిన ఎడల ఇంటికి వచ్చి పలు రకాల టెస్టులు నిర్వహిస్తామని డాక్టర్ అనూష తెలిపారు.

# వాహనాలు సీజ్ చేసిన అధికారులు







(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 21)

ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఉత్తర్వుల ప్రకారం, కనిగిరి ఎస్డిపిఓ సూచనల మేరకు కొండేపి మండల పరిధిలో గొడుగుల పాలెం, కొత్త కుమ్మరిపాలెం నందు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌ను, పొదిలి రోడ్ - అనకర్లపూడి రోడ్డు నందు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఒక ఆటోను సుమారు 60 బైకులు పైచిలుకు వాహనాలను సీజ్ చేయడం జరిగింది. వాహనాలు యొక్క సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించి వాహనాలకు జరిమానా విధించడం కానీ, వాహనాలను జప్తు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఒంగోల్ ఏ ఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, కొండేపి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.సోమశేఖర్, ఎస్ఐ ప్రేమ్ కుమార్ ఇద్దరు రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు , సుమారు 70 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా గాంజా తనిఖీని, బెల్ట్ షాపులు తనిఖీని అసాంఘిక కార్యక్రమాలు జరిగే ప్రదేశాల్ని పరిశీలించడం, వాహనాలను తనిఖీ చేసి డాక్యుమెంట్ లేని వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో డాగ్స్ స్వార్డ్ మరియు రోబో డ్రస్ పార్టీని, స్పెషల్ పార్టీని, ఏఆర్ పార్టీని మరియు వజ్ర వాహనాన్ని కూడా ఉపయోగించడం జరిగింది. ప్రజలు అప్రమత్తతో ఉండి మీ నివాస ప్రదేశాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లయితే సంబంధిత సమాచారాన్ని పోలీసులకు తెలియపరచాలని కోరారు.

# ఇంటి నివేశన స్థలాల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలి

## సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 21)



ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి జిల్లా కలెక్టర్లకు సూచించారు. విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి బుధవారం రెవెన్యూ అంశాలు, రీ సర్వే, నివేశన స్థలాల వెరిఫికేషన్ ప్రక్రియ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటిపట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో రీసర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంటి పట్టాల వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్టంగా చేపడుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా, తదితరులు పాల్గొన్నారు.



షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com




## మాజీ సీఎం జగన్‌ను కలిసిన చింతలచెరువు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 21)

తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కనిగిరి నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకులు చింతలచెరువు సత్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు.

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# బాపట్ల జిల్లా అభివృద్ధికి కలిసి పనిచేయాలి




### అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సూచించిన జిల్లా ఇన్చార్జి మంత్రి, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి



(షణ్ముఖ వెలుగు బ్యూరో, బాపట్ల, మే 21)

బాపట్ల జిల్లా అభివృద్ధి బాటలో పయనించడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. జిల్లా అభివృద్ధి మండలి సమీక్షా సమావేశం స్థానిక కలెక్టరేట్ లోని విసి హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. జల వనరులు, వ్యవసాయ, జాతీయ ఉపాధి పథకం, పర్యాటక రంగం తదితర అంశాలపై సమీక్ష సాగింది. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంతో పనిచేయాలని అధికారులకు జిల్లా ఇన్చార్జి మంత్రి మార్గ నిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. పొరుగు జిల్లాల కంటే మరింత అభివృద్ధి సాధించాలనే పోటీ తత్వంతో అధికారులు పనిచేయాలన్నారు. గడిచిన ఏడాదిలో జరిగిన అభివృద్ధి, వివిధ రంగాలలో ఆర్థిక వృద్ధిపై అధికారులు నివేదిక సిద్ధం చేయాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం మాని, మీ ఇంటి నుంచి ప్రభుత్వ సేవలు పొందే విధానంపై ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. తద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. వేసవికాలం ముగిసే వరకు తాగునీటి సమస్య రానివ్వరాదని, ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి తీరువా కు వడ్డీ ని ప్రభుత్వం రద్దు చేసిందని, ఆ మేరకు డీఆర్సీలో కమిటీ ఆమోదించి తీర్మానం చేసినట్లు ప్రకటించారు. జిల్లా జీఎస్‌డిపి పెంచడమే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. పంట కాల్వల పూడికతీత, మరమ్మతు పనులు వర్షాలు రాకముందే పూర్తి చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి ఆదేశించారు. మార్చిలోగా టెండర్లు పూర్తి చేసి, వేసవిలోగా పనులు ముగించాలని గతంలో ఆదేశించినప్పటికి నేటికీ టెండర్లు ప్రక్రియలోనే ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు మొదలవుతుంటే పనులు ఎప్పుడు చేస్తారు, ఏలా పూర్తవుతాయి. పంట కాల్వల మరమ్మతు పనులు నామమాత్రంగా నిర్వహించి బిల్లులు పెట్టుకోవడానికా అంటూ అధికారులను నిలదీశారు. ఆ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సంవత్సరంలో వర్షాలు ముందుగా వచ్చే అవకాశం ఉందన్నారు. సాగునీరు విడుదలకు సిద్ధంగా ఉండాలి, ముందస్తుగా పంటల సాగుకు రైతులను సమాయత్తం చేయాలన్నారు. ఎత్తిపోతల పథకాలు పునరుద్ధరించడానికి అంచనాలు నవీకరించాలన్నారు. తయారుచేసిన అంచనాల ప్రతిపాదనలపై నివేదిక ఇవ్వాలన్నారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంతో ఇంజినీర్లు సహకరించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద గత ఏడాది రూ.20 కోట్ల నిధులు మురిగిపోవడంపై అధికారులను నిలదీశారు. పేద ప్రజలకు పనులు కల్పించలేకపోవడం, జిల్లాకు నష్టం జరగకుండా అధికారులు ప్రణాళికతో పనిచేయాలన్నారు. అత్యధికంగా ఉపాధి పనులు చేపట్టాలి, కూలీలకు విస్తృతంగా పనులు కల్పించాలన్నారు. పొగాకు పంట అధికంగా సాగు చేయాలని కంపెనీలు ఒత్తిడి చేసి, దిగుబడి వచ్చిన తర్వాత రైతులను వదిలేయడం మంచి పద్ధతి కాదన్నారు. జిల్లాలో రైతులు పండించిన పొగాకు పంటను మొత్తం సదరు కంపెనీలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సాగులో కంపెనీల భాగస్వామ్యం ఉన్నందున రైతులకు నష్టం జరగకుండా ఖచ్చితంగా కొనుగోలు చేపించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. కనీస ధరలు కల్పించకుండా రైతులను బ్లాక్ మెయిల్ చేస్తే కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి నీటి తీరువా కు వడ్డీ ని వసూలు చేయరాదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. తక్షణమే వడ్డీ రాయితీని అమలు చేయాలన్నారు. రైతుల నుంచి కేవలం నీటి పన్ను మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. చెరువుల పూడికతీత పనులలో భాగంగా చెరువుల కట్టలను బలోపేతం చేయాలన్నారు. వర్షాలు వచ్చేలోగా పనులను శరవేగంగా చేపట్టాలన్నారు. జల వనరులు, మైన్స్ అధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. గుండ్లకమ్మ నదిపై మల్లవరం ప్రాజెక్ట్ గేట్లు పూర్తిగా మరమ్మతులు చేయాలన్నారు. పనులు ఎట్టి పరిస్థితుల్లో ఆపరాదని, నిధులు తెప్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఎత్తిపోతల పథకం కింద ఉన్న ప్రాజెక్టుల మరమ్మతులకు పునరుద్ధరణ ధరలతో అంచనాలపై నివేదిక పంపాలన్నారు. పమిడిమర్రు ఎత్తిపోతల పథకం అంచనాలను రూపొందించాలన్నారు. ఈ పనులు వేగంగా జరగడానికి తాత్కాలిక పద్ధతిలో సిబ్బందిని నియమించాలన్నారు. తక్షణమే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలన్నారు. ఎత్తిపోతల పథకాల పనులు వేగంగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగానే సత్యప్రసాద్ చెప్పారు. మీరు పనులు చేయండి, నిధులు మంజూరు చేయిస్తామన్నారు. వేలాది ఎకరాల సాగు పెరగడంతోపాటు రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నీటి తీరువా వసూలులో భూమి అమ్మిన వారి పేర్లు కూడా ఆన్ లైన్ లో చూపిస్తున్నాయన్నారు. తద్వారా భూ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, వాటిని నివారించాలన్నారు. చెరువుల పూడిక తీత పనులు వేగంగా చేపట్టాలని ఆయన సూచించారు. జల జీవన్ మిషన్ కింద రూ.532.39 కోట్లు పనులు చేయకపోవడంతోనే నిధులు మురిగిపోయాయని బాపట్ల పార్లమెంట్ సభ్యులు, పానెల్ స్పీకర్, హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. 1,080 పనులు నిలిచిపోవడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి, జిల్లా ప్రజలకు నష్టం జరుగుతుంటే అధికారులు చూస్తున్నారా అంటూ నిలదీశారు. ఉపాధి పనులు తక్కువగా చేయడం ద్వారా జిల్లాకు నష్టం వాటిల్లిందన్నారు. వేమూరు నియోజకవర్గంలో గతేడాది కేవలం 62.80 శాతం పనులు జరగడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లాలో పర్యాటకులు పెరగడానికి పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధన దిశగా యంత్రాంగం అడుగులు ముందుకు వేస్తోందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనలు, ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించడానికి యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. పొగాకు సాగు చేసే సమయంలో కంపెనీలు ఒత్తిడి చేసి సాగు విస్తీరణం పెంచాయన్నారు. ఇప్పుడు కొనుగోలు చేయకుండా ఉంటే అలాంటి కంపెనీలపై క్రిమినల్ కేసులు పెట్టే అంశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వదేశీ దర్శి- 2 కింద సూర్యలంక బీచ్ ని అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.97 కోట్లు పర్యాటకానికి నిధులు విడుదలయ్యాయన్నారు. అభివృద్ధి పనులకు టెండర్ లో పిలిచే ప్రక్రియ చేపడుతున్నామని, అభివృద్ధి చేసే అంశాలపై పిపిటి ద్వారా వివరించారు.

వాడరేవు- పిడుగురాళ్లు, గుంటూరు-నిజాంపట్నం ఓడరేవు వరకు జాతీయ రహదారులు, 216 జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అద్దంకి రేంజ్ ఏర్పాటుకు భూసేకరణ చేపట్టామన్నారు. పొగాకు పంటను రైతుల వద్ద నుంచి కంపెనీలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. రానున్న సంవత్సరంలో ఇలాంటి సమస్య తలెత్తకుండా సాగులో నియంత్రణ ఉండేలా చూడాలన్నారు. సాగునీరు ముందుగా విడుదల అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులకు పెండింగ్ లో ఉన్న బిల్లులు చెల్లించాలన్నారు. ఎత్తిపోతల పథకం మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మంత్రిని కోరారు. వాటికి నిధులు కేటాయించి వందలాది ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు. రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. చీరాల నియోజకవర్గంలో ఉపాధి పనులు అధికంగా కేటా యించి, పేదలకు ఉపాధి చూపాలని కోరారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెనీ క్రిస్టీనా, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

## యోగా సాధనతో ఆరోగ్యకరమైన జీవితం సాకారం

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 21)

దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను నిత్య సాధన చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సాకారమవుతుందని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహక ఏర్పాట్లలో భాగంగా బుధవారం ఉదయం ఒంగోలు నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో జరిగిన మెగా యోగా సాధనలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఏపి పర్యటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జూన్ 21వ తేదీన నిర్వహించనున్న11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన రాష్ట్రంలోని విశాఖకు వస్తున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా (తరువాయి 4లో...)

## ఏ ఒక్క ఉద్యోగిని తొలగించం

**గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులు ఆందోళన చెందవద్దు**
**గ్రామ వార్డు సచివాలయాల సంఖ్యను తగ్గించే ఆలోచన ప్రభుత్వానికి లేదు**
**గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా రియల్ టైంలో ప్రజలకు మరిన్ని సేవలు**
**ఎబిసి కేటగిరీలుగా సచివాలయాల విభజన సిబ్బంది సర్దుబాటుకు చర్యలు**
**సిబ్బందిని సర్దుబాటు చేశాకే బదిలీలు చేపడతాం**
**సచివాలయాల పనితీరు నిరంతర పర్యవేక్షణకు మూడు అంచెల విధానం**
**మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి**



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 21)

రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులెవరినీ తొలగించబోమని, అలాగే వాటి సంఖ్యను తగ్గించే ఆలోచన ప్రభుత్వానికి లేదని, దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర గ్రామ,వార్డు సచివాలయాలు,సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.శ్రీబాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. బుధవారం అమరావతి వెలగపూడి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రామ వార్డు సచివాలయాల రేషన లైజేషన్ కు ఇటీవల జిఓ జారీ చేయడం జరిగిందని సచివాలయాల ద్వారా రియల్ టైంలో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించే విధంగా వాటిని తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు.ఇందుకుగాను సచివాలయాలను (తరువాయి 4లో...)

## కార్యకర్తలే టిడిపి బలం

**కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటాం**
**టిడిపితోనే ప్రకాశం అభివృద్ధి**
**ఒంగోలుకు ప్రతిరోజు తాగునీరు అందిస్తాం**
**2 సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తాము**
**ఒంగోలు నియోజక వర్గ మినీ మహానాడులో**
**ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల, టిడిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 21)

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, వారి రుణం ఏం చేసినా తీర్చుకోలేనిదని ఒంగోలు ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ రావు, టిడిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. ఒంగోలులోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో బుధవారం తెలుగుదేశం (తరువాయి 4లో...)





## ఆలయాల మధ్య అడ్డుగోడ

**శివకేశవ ఆలయాలను విడగొడుతూ గోడ నిర్మాణం**

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు, గ్రామస్తులు**

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 21)

మండల కేంద్రమైన పొన్నలూరులోని శివాలయం చెన్నకేశవ ఆలయాల మధ్య ప్రహరీ గోడ నిర్మాణం వివాదానికి దారితీస్తోంది. శాస్త్ర విరుద్ధంగా రెండు ఆలయాల మధ్య గోడను నిర్మించడం పట్ల భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొన్నలూరు గ్రామంలో దశాబ్దాల నుంచి దక్షిణముఖ శివాలయం, చెన్నకేశవ ఆలయాలు రెండు ఒకే ప్రాంగణంలో నిర్మించబడ్డాయి. ఒకే స్థలంలో శివకేశవ ఆలయాలు ఉండటం చాలా అరుదుగా చెప్పుకుంటారు. ఇక్కడ రెండు ఆలయాల మధ్య ఎలాంటి అడ్డుగోడలేదు. భక్తులు రెండు ఆలయాల్లో పూజలు చేస్తుంటారు. శివాలయం దేవాదాయ శాఖ ఆధీనంలో ఉండగా, చెన్నకేశవ ఆలయ నిర్వహణ బాధ్యతలను ధర్మకర్తలు చూస్తున్నారు. అయితే శాస్త్ర విరుద్ధంగా మూడు రోజుల క్రితం రెండు ఆలయాల మధ్య ప్రహరీ గోడ నిర్మించడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒకరిద్దరు చెప్పిన మాటలను గుడ్డిగా నమ్మి, రెండు ఆలయాల మధ్య గోడ నిర్మించారు. చెన్నకేశవ స్వామి ఆలయ ధర్మకర్తలే ఈ శాస్త్ర విరుద్ధమైన పనికి పూనుకున్నారు. లవాస్తవానికి శివకేశవ ఆలయాలను విడగొట్టేలా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని, చెన్నకేశవ స్వామి ఆలయ ధర్మకర్తలు ఎలాంటి సమాచారం లేకుండా, తమ అభిప్రాయాలను, మనోభావాలను పట్టించుకోకుండా గోడ నిర్మించడం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. శివాలయం వెనుక వైపు కనీసం ప్రదక్షిణ చేయడానికి కూడా స్థలాన్ని వదలకుండా గోడ నిర్మించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై గ్రామస్తులు సదరు ధర్మకర్తలకు ఫోన్ చేసి అడిగితే, (తరువాయి 4లో...)

# బాపట్ల జిల్లా అభివృద్ధికి కలిసి పనిచేయాలి











# యోగా సాధనతో ఆరోగ్యకరమైన జీవితం సాకారం

యోగ పై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో రాబోయే నెల రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు పట్టణాల్లో అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేస్తూ యోగేంద్ర కార్యక్రమాన్ని నెల రోజులపాటు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అందుకు అనుగుణంగా యోగా సాధన వలన కలుగు ప్రయోజనాలను ప్రజలకు తెలియచేసేలా రాబోయే నెల రోజుల పాటు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అన్ని పాఠశాలలు, కళాశాలల్లో యోగా సాధనపై అవగాహన కలిగించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. యోగాను నిత్యం సాధన చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సాకారమవుతుందన్నారు. యోగా చేయడం వల్ల కలిగే లాభాలు అందరికీ తెలుసునని, దాన్ని తమ నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాల్సి ఉందన్నారు. తద్వారా అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేందుకు వీలుంటుందన్నారు. ఇదే నినాదాన్ని సైతం స్వచాంధ్ర విజన్- 2047 లో కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి హ్యాపీ, హెల్దీ, వెల్దీ సిటిజెన్ లుగా ఉండాలని పేర్కొన్నారన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ కుమార్ మాట్లాడుతూ, భారత దేశంలో పుట్టిన యోగా యొక్క ప్రాముఖ్యతను గుర్తించి 2014 జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని, అప్పటి నుంచి ప్రతి సంవత్సరం జూన్ 21వ తేదీన యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుచున్నదన్నారు. యోగా మన శారీరక, మానసిక, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. మనస్సును ప్రశాంతంగా ఉంచుతుందన్నారు. ప్రతి ఒక్కరు రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ, యోగా అంటే అందరికి తెలిసిందే, యోగా వలన మనస్సు, శరీరం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు అర్ధ గంట పాటు యోగా సాధన చేయడం వలన మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనం సాగించడానికి ఎంతో సహాయపడుతుందన్నారు. ఏపీ పర్యటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ యోగాను ప్రపంచానికి తెలియచేసింది భారత దేశమన్నారు. మన ప్రాచీన సంస్కృతిలో యోగా ఒక భాగమని, దీనిని అందరూ అభ్యసించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిని ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించాలన్న ఉద్దేశ్యంతో పదేళ్ల క్రితం గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ యోగా దినోత్సవానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ మన దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. ప్రతిరోజు యోగా చేస్తూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాబోయే నెల రోజులు పాటు ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ తయారు చేసుకొని జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో యోగ సాధన చేసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు యోగ సాధనలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు పతంజలి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులు, యోగ సాధకులు, జిల్లా అధికారులు తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్ యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆయుష్ శాఖ ఆర్డిడి పద్మజాతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, యోగా సాధకులు తదితరులు పాల్గొన్నారు.




# ఏ ఒక్క ఉద్యోగిని తొలగించం

ఎబిసి అనే మూడు కేటగిరీలుగా విభజించామని ఆ ప్రకారం సిబ్బందిని సర్దుబాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనగా 2500 జనాభా గల గ్రామ సచివాలయంలో 6గురు సిబ్బంది,2500-3000 జనాభా గల సచివాలయాల్లో 7రు,3వేలకు పైన జనాభా గల సచివాలయాల్లో 8మంది సిబ్బంది ఉండేలా విభజించామని, అంతేగాక క్లస్టర్ విధానాన్ని అనుసరించడం జరుగుతుందని అందుకు అనుణంగా సిబ్బందిని సర్దుబాటు చేశాక వారి బదీలను చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.అందుకే ప్రస్తుత సాధారణ బదిలీల సమయంలో సచివాలయాల సిబ్బంది బదిలీల ప్రక్రియను చేపట్టబోమని అన్నారు.ప్రస్తుతం కొన్ని సచివాలయాల్లో 10 మంది వరకూ సిబ్బంది ఉండగా కొన్నిచోట్ల ముగ్గురు నలుగురు సిబ్బందితో కూడా అవి నడుస్తున్నాయని చెప్పారు.దానివల్ల కొన్ని చోట్ల ఎక్కువ పని ఒత్తిడి కొన్ని చోట్ల తగిన పనిలేని పరిస్థితులు ఉన్నాయని అలాంటి సమస్యలన్నిటినీ పరిష్కరించి సిబ్బంది అందరికీ పూర్తి స్థాయిలో పని కల్పించి, దీని ద్వారా ప్రజలకు రియల్ టైంలో మరిన్ని సేవలు సకాలంలో అందే విధంగా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని మంత్రి వీరాంజనేయ స్వామి పునరుద్ఘాటించారు. అదే విధంగా త్వరలో మూడు అంచెల విధానాన్ని అమలులోకి తీసుకురానున్నట్టు మంత్రి వీరాంజనేయస్వామి వెల్లడించారు.అనగా జిల్లా,మండల,అసెంబ్లీ నియోజకర్గ స్థాయిలో ప్లానింగ్ బోర్డులు ఏర్పాటు చేసి జిల్లా స్థాయిలో జిల్లా అధికారి,మండల స్థాయిలో ఎంపిడిఓ, నియోజకవర్గ స్థాయిలో ఒక అధికారికి కొంతమంది సిబ్బందిని ఇచ్చి వారి ద్వారా గ్రామ , వార్డు సచివాలయాల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి బాలవీరాంజనేయ స్వామి మీడియాకు వివరించారు.ఈ సమావేశంలో గ్రామ,వార్డు సచివాలయాల డైరెక్టర్ శివ ప్రసాద్ పాల్గొన్నారు.



# కార్యకర్తలే టిడిపి బలం

పార్టీ ఒంగోలు నియోజక వర్గం మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పార్టీ అన్నారు. ఒంగోలులో తెలుగుదేశానికి ఘన విజయాన్ని అందించిన ఘనత కార్యకర్తలది అన్నారు. టిడిపి పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ దేశంలో ఏ నాయకుడికి లేనివిధంగా పేదలకు కిలో రెండు రూపాయలు బియ్యం, పక్క గృహాలు, పింఛన్ వంటి శాశ్వత సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఆయన బాటలోని నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ప్రజల కోసం పని చేస్తున్నారన్నారు. ఒంగోలు నియోజక వర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు త్వరలో ఒంగోలుకు ప్రతిరోజు తాగునీరు అందిస్తామని, పేదలకు రెండు సెంట్లు వంతెన నివేసిత స్థలం తో పాటుగా ఇంటిని కూడా నిర్మించి ఇస్తామని, పోతురాజు కాలువ అభివృద్ధి చేస్తామని, డీకే భూములు కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్న వారికి వారి పేరుతోనే తిరిగి వీళ్ళ పట్టాలు ఇస్తామని, ఒంగోలు నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అంతకుముందుగా మాట్లాడిన డాక్టర్లుకు ఇస్తాను బాలాజీ తెలుగుదేశం పార్టీ బిసి, ఎస్సీ, ఎస్టీల పార్టీ అన్నారు. అనగా నేనా వర్గాలను అభివృద్ధిలోకి తెచ్చిన పార్టీ అన్నారు. ఎన్టీఆర్ మహిళలకు తగిన గౌరవం ఇస్తూ ఆస్తిలో వాటా ఇవ్వటంతో పాటుగా, రిజర్వేషన్ కూడా కల్పించారన్నారు. జగన్ తిరిగి అధికారంలోకి వస్తానని కలలు కంటున్నారని, అవి కలలుగానే మిగిలిపోతాయని ఎద్దేవా చేశారు. 2029 ఎన్నికలలో కూడా తెలుగుదేశం పార్టీ తిరిగి విజయ బావుటా ఎగురు ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందుగా నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మినీ మహానాడు కార్యక్రమాన్ని అతిథులు చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఒంగోలు నగరం మేయర్ గంగాడ సుజాత, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, టిడిపి ఒంగోలు నియోజక వర్గం పరిశీలకులు వినుకొండ సుబ్రహ్మణ్యం, వైవి సుబ్బారావు, కొఠారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, యక్కల తులసిరావు, కుసుమ కుమారి, ఆర్ల వెంకటరత్నం, ఉప్పలపాటి నాగేంద్రమ్మ, సింగరాజు రాంబాబు, ఒంగోల్ నగర్ కార్పొరేషన్ టిడిపి కార్పోరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఆలయాల మధ్య అడ్డుగోడ



సరైన సమాధానం చెప్పడం లేదని మండిపడుతున్నారు. అక్రమంగా చేపట్టిన గోడ నిర్మాణం గురించి స్థానిక శాసనసభ్యులకు, దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు. వెంటనే రెండు ఆలయాల మధ్య నిర్మించిన గోడను తొలగించాలని, లేకుంటే శాస్త్ర, ధర్మ పరిరక్షణకు ఎంతవరకైనా వెళతామని భక్తులు భక్తులు, గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యం






(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 21)

జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో ఎస్పీ ఏ ఆర్ దామోదర్ బుధవారం కనిగిరిలోని పవిత్ర కళ్యాణ మండపంలో నెలవారీ నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ నేర నియంత్రణకు, నేరాల ఛేదించుటకు సంబంధించి పోలీస్ అధికారులకు పలు కీలక సూచనలు, మెళకువలను తెలియజేసారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ ప్రత్యేకంగా దర్యాప్తులో ఉన్న హత్య కేసులు, పోక్సో, రేప్ కేసులు, క్రైమ్ అగనెస్ట్ ఉమన్, మిస్సింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, పెండింగ్ లో ఉన్న కేసులు, ఎన్ఫోర్స్మెంట్ వర్క్, పెండింగ్ సీసీటీఎన్ఎస్ ద్వారా సమీక్ష చేశారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, కేసుల్లో పురోగతి, నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తుల తీరుతెన్నులు మొదలైన అంశాలపై పోలీస్ అధికారులను ఆరా తీశారు. ప్రణాళిక బద్దంగా యూఐ కేసులను తగ్గించుకోవాలని, మహిళలు, బాలికల మిస్సింగ్ కేసుల్లో సమగ్ర విచారణ జరిపి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా ట్రేస్ చెయ్యాలని, అదృశ్యమైన వారి ఆచూకీ కనుగొనడంలో అధునాతన విధానాలు అనుసరించాలన్నారు. అతి తీవ్రమైన నేరాలలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసి తగిన సాక్ష్యాధారాలతో నేరస్తులకు శిక్ష పడే విధంగా చేయాలని, ఆయా కేసుల ఛేదింపునకు మరియు పరిష్కారానికి దోహదపడే కీలక మెళకువలను అధికారులకు వివరించారు. జైలు నుండి విడుదలైన పాత నేరస్థులపై నిఘా ఉంచాలని, మరియు చెడునడత గల వ్యక్తుల యొక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. అదే విధంగా జైలు నుంచి బయటకు వచ్చిన వారిపై నిఘా ఉంచాలని, నాన్ బెయిలబుల్ వారెంట్స్ (ఎన్‌బీడబ్ల్యూఎస్) పెండింగ్‌కు గల కారణములు తెలుసుకొని,ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పెండింగ్ ఎన్‌బీడబ్ల్యూఎస్‌ను త్వరితగతిన ఎగ్జిక్యూట్ చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకై తగు ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాదాలకు గల కారణాలపై విశ్లేషణ చేసి ప్రమాదాల కట్టడికి తగు రీతిలో చర్యలు తీసుకోవాలని, ప్రతి రోజు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు

జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్
జిల్లాలోని పోలీసు అధికారులతో
నేర సమీక్షా సమావేశం నిర్వహించిన ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్
పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు కృషి చేయాలి
ఎన్ఫోర్స్మెంట్‌ను పెంచాలి
శాంతి భద్రతలను పరిరక్షిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టాలి.
మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
గంజాయి, మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు,
చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి








ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లాలో వ్యాప్తంగా ముఖ్యమైన కూడలిల వద్ద, బ్లాక్ స్పాట్స్, ఆక్సిడెంట్ ప్రోన్ ఏరియాల వద్దల సైన్, జాగ్రత్త బోర్డులు, రేడియంపెయింటింగ్స్, స్టిక్కరింగ్, స్పీడ్ బ్రేకర్స్ లను ఏర్పాటు చేయాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుచున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎట్టి పరిస్థితుల్లో అలాంటి వారిని ఉపేక్షించవద్దని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిల్లో హైవేలపై పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, దొంగతనాలు జరగకుండా ముఖ్యమైన ప్రాంతాలలో తగిన బీట్లు, లర్కింగ్ పాయింట్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనాల కేసుల ఛేదనకు ప్రత్యేక క్రైమ్ బృందాలు ఏర్పాటు చేసుకోని రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. నేరాలు దోపిడీల నివారణకు సమర్థవంతమైన బీట్లు, పికట్స్, లర్కింగ్ పాయింట్స్ ఏర్పాటు చేసుకొని అధికారులు తరుచుగా బీట్ చెక్ చేస్తూ సిబ్బందికి సూచనలు ఇవ్వాలని, పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజలకు వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. శాంతి భద్రతలు విఘాతం కల్గిస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ఎక్కువ కేసుల్లో వున్న వారిపై పిడి చట్టం ప్రకారం చర్యలు తీసుకొనుటకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎన్ఫోర్స్మెంట్ ను పెంచి నేరాలను కట్టడి చేయాలన్నారు. డ్రోన్ ఉపయోగించి అసాంఘిక కార్యకలాపాలకి అడ్డుకట్ట వేసే విధంగా డ్రోన్ పోలీసింగ్ చేపట్టాలన్నారు. అనంతరం ముఖ్యంగా త్వరలో పాఠశాలలు, కళాశాలలు ఓపెన్ అవుతున్న సందర్భంగా విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడా తెలియచేయాలని,స్వీయ రక్షణ, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో జరిగే మోసలపట్ల, చట్టాలపై, ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి కూడా అవగాహన కల్పించాలని, ఎంఈవో, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించాలన్నారు. పోలీసు అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా పని చేయాలని, ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి భాదితులకు న్యాయం చేకూరుస్తామనే భరోసా కల్పించాలన్నారు. విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. కొండేపి పోలీస్ స్టేషన్ పరిధిలో 12.05.2025న కొండేపి బస్టాండ్‌లో కందుకూరు బస్సు ఎక్కే సమయంలో బంగారం, వెండి ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగును చీరాలకు చెందిన చవట అంజలి (39 సం) ఆమె బ్యాగును కత్తిరించి అందులోనే ఉన్న బంగారము, వెండి, నగదు మరియు పాస్ ఫోటోను తీసుకొని వెళ్లారు. ఈ కేసును అన్ని కోణాలలో దర్యాప్తు మరియు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సుమారు 15 లక్షలు విలువగల బంగారం, వెండి, నగదు, ఇండియన్ పాస్ పోస్ట్ రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన కొండేపి సీఐ జి సోమశేఖర్, కొండేపి ఎస్ఐ ప్రేమ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుల్ సురేష్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాలను, రివార్డ్స్ ను జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె నాగేశ్వరరావు, డిఎస్పిలు ఆర్ శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, రమణ కుమార్, డిసిఆర్బి సిఐ దేవప్రభాకర్, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్లకు అవార్డులు

ఆర్మీ డ్రిల్, టెంట్ పిచ్చింగ్‌లో బెస్ట్
నెక్స్ట్ లెవెల్ ట్రైనింగ్ కి ఎంపికైన క్యాడెట్లకు అభినందనలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 21)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ సీసీ క్యాడెట్లు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బెస్ట్ క్యాడెట్లుగా అవార్డులు అందుకున్నారు. ఒంగోలు ఆర్జేయూ కేటీలో ఈనెల 12 నుంచి 21 వరకు జరిగిన యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ – 2 లో క్విస్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. క్యాంప్‌లో భాగంగా నిర్వహించిన ఆర్మీ డ్రిల్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పూర్ణిమ బెస్ట్ క్యాడెట్‌గా నిలిచింది. టెంట్ పిచ్చింగ్ కాంపిటీషన్‌లో అత్యంత తక్కువ టైంలో టెంట్ వేసిన ఉపదేశ్, విజయ్, అభిషేక్, హరిశంకర్, జయంత్, కరీంభాష, వెంకటేశ్ మొదటి బహుమతి సాధించారు. దాంతో పాటుగా తల్ సైనిక్ షూటింగ్, అబస్టకల్ ట్రైనింగ్‌లో ప్రతిభ కనబరిచిన వెంకటేశ్, జయంత్, హేమసాయి, విజయ్, అభిషేక్, ఉపదేశ్‌లు చీరాలలో జరగబోయే తదుపరి క్యాంప్‌కి ఎన్నికయ్యారు. ప్రకాశం జిల్లా నుంచి కేవలం క్విస్ కళాశాల విద్యార్థులు మాత్రమే నెక్స్ట్ లెవెల్ ట్రైనింగ్‌కి ఎన్నికైనట్లు ఎన్‌సీసీ చీఫ్ రమణయ్య తెలియజేశారు. బహుమతులు, అవార్డులు సాధించిన క్యాడెట్లను, వారికి ట్రైనింగ్ ఇచ్చిన రమణయ్య, ఎన్ సీసీ డీన్ డాక్టర్ వాసుబాబు, శ్రీనీలాయని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రి అభినందించారు. కార్యక్రమంలో ఇంఛార్జ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రశాంత్, బీఎస్, హెచ్‌వోడీ డాక్టర్ జి శ్రీనివాసరావు, సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 21)

ఒంగోలులోని ట్రంక్ రోడ్డులో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోవడం జరిగింది. నడిరోడ్డు పై కార్లు పార్క్ చేయడం వల్ల వచ్చి పోయే వాహనాలకు ఇబ్బంది ఎదురవుతున్నాయి. పాత ఎల్ఐసి ఆఫీస్ ఎదురు విపరీతంగా రోడ్లుపై కార్లు పెట్టి వెళ్లిపోవడం జరుగుతుంది. రాత్రి సమయంలో ఒక హెూటల్లోకి వెళ్లడానికి ఒక వ్యక్తి నడిరోడ్డుపై కారు పార్కింగ్ చేసి వెళ్లడంతో, దాని వెనుక ఇంకో కార్ పార్క్ చేయడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుకుంటున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశం పోస్టర్ విడుదల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 21)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశం జూన్ 5వ తేదీన విజయవాడలో రాష్ట్ర అధ్యక్షుడు కె ఆర్ సూర్యనారాయణ నాయకత్వంలో నిర్వహించబడుతున్న సందర్భంగా బుధవారం కనిగిరి పట్టణంలోని వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కౌన్సిల్ సమావేశ పోస్టర్ ను ప్రకాశం జిల్లా కార్యవర్గ సభ్యులు రామన వెంకటేశ్వర రెడ్డి కనిగిరి తాలూకా యూనిట్ నాయకులతో పాటు కలసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, బకాయిలు, వేతన సవరణ పై చర్చలు జరగనున్నాయని తెలిపారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ కూడా హాజరవుతారని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, భవిష్యత్‌కు ఈ కౌన్సిల్ సమావేశం మంచి వేదికని అన్నారు. ఉద్యోగులందరూ భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎపిజిఈ ఎ కనిగిరి తాలూకా యూనిట్ అధ్యక్షులు రమేష్ బాబు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, పి మల్లిఖార్జున, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## యర్రగొండపాలెంలో కోలాహలంగా మినీ మహానాడు

భారీగా పాల్గొన్న టీడీపీ శ్రేణులు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మే 21)

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భారీ టీడీపీ శ్రేణుల కోలాహలంలో మినీ మహా నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, పరిశీలకులు వేములకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ సెంటర్ వద్ద స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకుని తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలతో మహానాడు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం నియోజకవర్గ తీర్మానాలను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.







## ఘనంగా యోగా దినోత్సవం వేడుకలు




(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 21)

కనిగిరి పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం, అంగన్వాడీ కేంద్రాలలో యోగా దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ పి సరోజిని మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ యోగాసనాలు చాలా అవసరమని అన్నారు.యోగాను ప్రతి ఒక్కరూ జీవితంలో నిబద్ధతో కూడిన అలవాటుగా చేసుకోవాలన్నారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఇతరులకు వివరించాలన్నారు. అలాగే విద్యార్థులు కూడా కేవలం చదువు మాత్రమే కాకుండా యోగాను దినచర్యలో భాగంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్స్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## లారీని ఢీకొట్టిన ఫార్చునర్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 21)

ఈ బుధవారం సాయంత్రం 4:45 గంటలకు ఒంగోలులోని కొత్తపట్నం వెళ్లే రోడ్డులో ఫ్లై ఓవర్ కి లెఫ్ట్ సైడ్‌లో ముందు వెళ్తున్న లారీని వెనకనుంచి వచ్చినటువంటి ఫార్చునర్ ఏపీ39ఎల్‌యు 0333 వెహికల్ ఢీకొట్టగా వెహికల్ డ్యామేజ్ అయింది. వెహికల్‌లో 6 మంది ఉండగా, నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని సంఘమిత్ర హాస్పిటల్‌లో జాయిన్ చేసి ట్రీట్మెంట్ చేస్తున్నారు. వీరు చెన్నై నుండి బయలుదేరి విజయవాడకు వెళుతున్నారు. గాయాలైన వారిలో శాఖమూరి ధనంజయ నాయుడు, ఎస్ శారద (48), పి నాగేశ్వరమ్మ(65), డ్రైవర్‌జి కోరుకొండ నగేష్ సన్‌ఆఫ్ ఫైడి రాజు(19) పిల్లలు ఉన్నారు.

## అదుపు తప్పి బిల్డింగ్‌పై పడి మృతి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 21)

ఒంగోలు పట్టణంలోని నెహ్రూ నగర్ ఎక్స్టెన్షన్‌లో భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డికు చెందిన అపార్ట్మెంట్ వర్క్ జరుగుతుండగా పేర్నమెట్ట, సుందరయ్య కాలనీ, లాస్ట్ లైన్ సామిచెట్టి సుధాకర్‌రావు టైల్స్ వర్క్ హెల్పర్‌గా చేస్తున్నాడు. వ్యక్తి రెండవ ఫ్లోర్లోకి ఎక్కి కిందకి దూకడంతో పక్కన బిల్డింగు పై పడి రక్త గాయాలు అయ్యాయి. తాలూకా పోలీస్ సిబ్బంది 108 అంబులెన్స్‌లో రిమ్స్ హాస్పటల్ కు పంపారు. ఆసుపత్రికి వెళ్లగా డాక్టర్ చెక్ చేసి మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు.

## సాంప్రదాయాలకు విరుద్ధంగా కర్లపాలెం వీవో సమావేశాలు



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 21)

కర్లపాలెం మండల పరిధిలో సాంప్రదాయాలకు విరుద్ధంగా డిఆర్డిఏ లో ఉన్న వారు వ్యవహరిస్తున్నారు. తాము ఎక్కడికి వెళ్లినా హోదా కోరుకుంటున్నారు. తమ పథకం ఉద్దేశం పేదలను ధనవంతులను చేయటం. అలా చేయాలి అంటే మనం సామాన్యుల్లో కలిసిపోయి వారితో కలిసి కూర్చొని కలిసి మాట్లాడగలిగి క్రింది స్థాయికి వెళ్లి వారి సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరించగలగటం. మంగళవారం డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు కర్లపాలెం మండలంలో పర్యటించారు. ఆయన కర్లపాలెం పంచాయతీల్లో సమావేశాన్ని ఏర్పాటు చేసి కిందనే కూర్చొని మాట్లాడారు. కానీ కర్లపాలెం మండలంలో పనిచేస్తున్న సీసీలు వివో సమావేశంలో అందరూ మహిళలు ఉన్నప్పటికీ కాలు మీద కాలు వేసుకుని కుర్చీలో కూర్చుని సమావేశాలు నిర్వహించటం వలన మహిళల సమస్యలు తెలుసుకునే అవకాశం లేకుండా పోతుంది. అంతేకాకుండా గ్రూపు సభ్యులతో మాట్లాడే విధానం కూడా చాలా దురుసుగా కించపరిచేటట్లు ఉంది అని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కర్లపాలెం డిఆర్డిఏ శాఖలో పని చేస్తున్నవారు వారి ప్రవర్తన మార్చుకొని సభ్యులతో మర్యాదగా మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై ఏపీఎం శ్రీనివాస్ రెడ్డిని వివరణ కోరగా కుర్చీలో కూర్చోకూడదు అనే నిబంధనలేమీ లేవని సహజంగా అందరితో మమేకం కావడానికి కిందే కూర్చుని సమావేశాలు నిర్వహిస్తామన్నారు. దాని వలన మనకు వారికి వ్యత్యాసం లేకుండా మాట్లాడుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇలా చేయటం వల్ల కూడా సభ్యులు మనతో మమేకమవుతారని వారి ఇంట్లో మనిషిలాగా మనతో మాట్లాడతారు అన్నారు. కచ్చితంగా కిందే కూర్చోవాలి అనే నిబంధన ఏమీ లేదని సాంప్రదాయం ప్రకారం అందరూ కిందే కూర్చుంటారు కాబట్టి అలా జరిగిపోతుందన్నారు. ఏదేమైనా పీడీ స్థాయి అధికారి కింద కూర్చుని సభ్యులతో మాట్లాడినప్పుడు కాలు మీద కాలేసుకుని సమావేశాలు నిర్వహించడం అంత సమంజసంగా అనిపించడం లేదంటున్నారు.

# కొండేపిలో డ్వాక్రా సంఘాల డైరీ యూనిట్ ఏర్పాటుకు ఐదు కోట్ల నిధులు మంజూరు





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 21)

నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో వ్యవసాయ ప్రధాన అనుబంధ కార్యక్రమమైన డైరీ యూనిట్ ఏర్పాటు చేయుటకు సెర్ప్ డిఆర్‌డిఏ వెలుగు శాఖ ద్వారా ఐదు కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటోరియం బోర్డ్ డైరెక్టర్ దామచర్ల సత్య తెలియజేశారు. కొండేపి మండల పరిషత్ కార్యాలయంలో డిఆర్డిఏ వెలుగు శాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి గోపీనాథ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి మారిటోరియం బోర్డ్ డైరెక్టర్ దామచర్ల సత్య గారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉన్నటువంటి చిన్న సన్న కారు రైతులకు వ్యవసాయంతో పాటుగా ప్రధాన అనుబంధ కార్యక్రమమైనటువంటి పాడి పరిశ్రమను అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇందులో భాగంగా సర్ప్ ద్వారా ప్రత్యేకంగా కొండేపి నియోజకవర్గ పరిధిలో రెండు డైరీ యూనిట్ లను మంజూరు చేయించడం జరిగిందని, ఒకటి కొండేపిలో కాగా మరొకటి సింగరాయకొండ మండలం పాకల గ్రామం. ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యూనిట్‌కి కావలసిన స్థల సేకరణలో సంబంధిత తహసీల్దారు సహకరించి తల కేటాయింపులు త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు అనేవి ముఖ్యమంత్రి మానస పుత్రిక లాంటిదని రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పక్షపాతంగా వ్యవహరిస్తూ వారి కుటుంబ జీవనోపాధి మెరుగుపరుచుకునే నిమిత్తం సెర్ఫ్ డిఆర్డిడిఏ వెలుగు శాఖ ద్వారా విరివిగా రుణాలు అందించడం,సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి మహిళా కూడా ప్రభుత్వం ద్వారా అందిస్తున్నటువంటి రుణాలను అందుకొని అభివృద్ధి చెందాలని కోరారు. రాష్ట్రస్థాయి నుంచి వచ్చినటువంటి ఎల్ హెచ్ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాబోయే ఆర్థిక సంవత్సరంలో మహిళలుకి కావలసినటువంటి అవసరాలను గుర్తిస్తూ వార్షిక జీవనోపాదుల ప్రణాళికలను వెలుగు సిబ్బంది ద్వారా తయారు చేయించడం జరిగిందని ఈ తయారైనటువంటి ప్రణాళికల ద్వారా మహిళల అవసరాలను తీర్చి వారి జీవనోపాధి మెరుగుకు రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ రుణాలను బ్యాంకులు అదేవిధంగా శ్రీనిధి, ఎస్సీ, ఎస్టీలకు అందించే ఉన్నతీ రుణాలు అన్ని క్రోడీకరించి మహిళా సంఘ సభ్యులకు కావలసినటువంటి అవసరాలను తీర్చడం జరుగుతుందని తెలిపారు. డిఆర్‌డిఏ పీడీ మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యుల కుటుంబ సభ్యుల వివరాలను కొత్తగా వచ్చినటువంటి యాప్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని భవిష్యత్ లో ఆ యాప్ ద్వారా మాత్రమే వారికి కావలసినటువంటి జీవనోపాధికి అవసరమైనటువంటి నిధులను అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి మహిళ ముఖాలను ఈ యొక్క యాప్ లో ఫోటోలు ద్వారా క్యాప్చర్ చేసి సర్వర్ కి పంపాలని ఆదేశించారు. మహిళలందరూ కూడా తప్పనిసరిగా సిబ్బందికి సహకరించి వారి వారి వివరాలను నమోదు చేయించు కోవాలని మహిళలను కోరారు. ఈ యొక్క కార్యక్రమాన్ని మండలంలో త్వరతగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ, ఎంపీడీవో , మండలం లో పని చేస్తున్న వెలుగు సీసీలు, వెటర్నరీ సిబ్బంది వివోఏలు పెద్ద ఎత్తున స్వయం సహాయక సంఘ సభ్యులు, లైవ్ పాడి గేదెలు ఉన్న మహిళ రైతులు పాల్గొన్నారు.



# నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘా

### జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 21)

ప్రకాశం జిల్లా పరిధిలో లా ,ఆర్డర్, నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, విపత్తు నిర్వహణ, ఇతర పోలీసింగ్ అవసరాలకు బేస్తవారిపేట మండలం, సాలకళవీడు గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ బిక్క రామాంజనేయ రెడ్డి ,దొనకొండ మండలం, ఎర్రబాలెం గ్రామం చెందిన మోడీ ఆంజనేయులు అనే వ్యక్తులు బుధవారం కనిగిరి పవిత్ర ఫంక్షన్ హాల్ లో జిల్లా ఎస్పీకి అత్యాధునిక సాంకేతికత కూడిన డీజేఐఏఆర్ 3ఎస్ డ్రోన్ కెమెరాలను అందజేశారు. జిల్లా పోలీస్ శాఖకు సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తితో పోలీస్ శాఖకు డ్రోన్ లను బహుకరించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ డ్రోన్‌లను బీవీ పేట, దొనకొండ పోలీస్ స్టేషన్‌లకు జిల్లా ఎస్పీ అందజేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షించడంలో సాంకేతికత యొక్క పాత్ర చాలా ముఖ్యమైనదని, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు, ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ఏరియాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజిబుల్ పోలీసింగ్, వివిధ విఐపిల బందోబస్తులలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయలు జరగకుండా డ్రోన్ కెమెరాలను ఉపయోగించడం జరుగుతుందని, ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ, సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె నాగేశ్వరరావు, మార్కాపురం డిఎస్పి యు నాగరాజు, దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సీఐ అస్సాన్, కంభం సీఐ మల్లికార్జునరావు, బేస్తవారిపేట ఎస్ఐ రవీంద్రరెడ్డి, దొనకొండ ఎస్ఐ త్యాగరాజు, ఆయా గ్రామాలకు సంబంధించిన ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.









# యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు

### జిల్లా కలెక్టర్ వెంకట మురళి





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 21)

జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నెలరోజుల పాటు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయనంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 477 గ్రామ పంచాయతీలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే 7 లక్షల మంది యాప్ లో వివరాలు నమోదు చేయడానికి చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి ఏ.ఎన్. ఎం, ఆశ వర్కర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో పర్యాటక మరియు ముఖ్యమైన ప్రదేశాలలో మే 31వ తేదీ, జూన్ 13,19 తేదీలలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకు పోతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 9వ తేదీన బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో యోగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయబో తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో సీనియర్ సిటిజనులకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వామ్యంలో చేయుటకు జిల్లాలోని 4 మున్సిపాలిటీలలో ప్రత్యేక యోగ కార్యక్రమాలను చేయబోతున్నట్లు తెలిపారు. గురువారం రోజు యోగాంధ్ర డివిజన్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# రోడ్ల మీద ఏర్పడిన గుంతలకు మరమ్మత్తులు చేపట్టాలి

### డిమాండ్ చేస్తున్న సిపిఐ బాపట్ల పట్టణ కార్యదర్శి మామిడి పత్తుల అశోక్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 21)

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బాపట్ల జిల్లా సమితి ఆధ్వర్యంలో బాపట్ల పట్నంలోని ప్రధాన రహదారి చాలా రోజుల నుంచి పెద్ద అంబేద్కర్ బొమ్మ వద్ద గడియార స్తంభం వద్ద పాత బస్టాండ్ వద్ద ఉప్పరపాలెం గేటు వద్ద చీలు రోడ్డు వద్ద ఇంకా అనేక చోట్ల గుంతల మయమైనదని మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలని, నాసిరకంగా ఉన్నచోటల్లా ఎక్కువ రోజులు ఉండే విధంగా సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అధికారులను, ప్రజా ప్రతినిధులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బాపట్ల పట్టణ కార్యదర్శి మామిడిపత్తుల అశోక్, సిపిఐ నాయకులు కంచర్ల ఏసురత్నం, మురళి, జన్సన్, మామిడి బత్తుల వెంకటేశ్వర్లు, తన్నీరు ర్యాన్, తదితరులు పాల్గొన్నారు.



# కోటి మంది సభ్యత్వాలు ఉన్న

# ఏకైక ప్రాంతీయ పార్టీ టీడీపీ



ఎన్ని ఇబ్బందులొచ్చినా కార్యకర్తలను కాపాడుకుంటాం

జిల్లాలో టీడీపీ కుటుంబాలను తరిమికొట్టారు

పల్నాడులో తోట చంద్రయ్యను అతి దారుణంగా చంపారు

చంద్రయ్య కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో అండగా నిలుస్తున్నాం

సంక్షేమం, అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లు

ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 21)

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావు పేటలో బుధవారం జరిగిన జిల్లా మినీ మహానాడు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. కార్యకర్తలను ఉద్దేశించి భావోద్వేగంగా మాట్లాడారు. టీడీపీ తన 43 సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొని నిలబడిందని గుర్తు చేశారు. తోట చంద్రయ్యను వైసీపీ రౌడీ మూకలు దారుణంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం ప్రాణాలర్పించిన చంద్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వ ఉద్యోగంతో ఆదుకున్నామని మంత్రి తెలిపారు. పల్నాడు ప్రాంతంలోని వేలాది టీడీపీ కుటుంబాలను నాటి వైసీపీ రౌడీలు గ్రామాల నుంచి తరిమి కొట్టారని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పల్నాడులోని వైసీపీ బాధిత కుటుంబాలను మరలా స్వగ్రామాలకు తీసుకొచ్చి, వారికి ఆర్థిక సహాయం చేశామని వివరించారు. కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. 1983లో పార్టీ పెట్టిన తరువాత కేవలం 9 నెలల కాలంలోనే అధికారం చేపట్టి, రికార్డు సృష్టించిన ఘనత తెలుగుదేశం పార్టీకి చెందుతుందని చెప్పారు. అదే విధంగా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో 2024లో కూటమి ప్రభుత్వం అంతే మెజారిటీతో అధికారం చేపట్టిందన్నారు. రెండు రూపాయిలకు కిలో బియ్యం, మహిళలకు సమాన ఆస్తి హక్కు వంటి ఎన్నో విప్లవాత్మక చట్టాలు తీసుకొచ్చిన ఘనత తెలుగుదేశం వ్యవస్థాపకులు, స్వర్గీయ ఎన్టీఆర్ దే అన్నారు. కోటి మంది సభ్యత్వం కలిగిన ఏకైక ప్రాంతీయ పార్టీ కూడా తెలుగుదేశమే అన్నారు. కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక పథకాలను చేపడుతున్నారని మంత్రి గొట్టిపాటి వివరించారు. గోదావరి జలాలను పట్టిసీమ ద్వారా కృష్ణా జిల్లా తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. అదే విధంగా కార్యకర్తల కుటుంబాల గురించి కూడా వ్యక్తిగతంగా ఆలోచించి రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నారని తెలిపారు. మహానాడు అంటేనే కార్యకర్తల పండుగ అని చెప్పిన మంత్రి గొట్టిపాటి, తెలుగుదేశం పార్టీ ఇబ్బందుల్లో ఉన్న సమయాల్లో, వైసీపీ నేతల ఘాతకాలకు ఎదురొడ్డి, ఎన్ని ఇబ్బందులొచ్చినా నిలబడి, పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చారని కార్యకర్తలను మంత్రి గొట్టిపాటి ప్రశంసించారు. కార్యక్రమంలో నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతో పాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



# సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

- గుడ్ హెల్ప్ చైర్మన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ - ప్రియాంక పుట్టిన రోజు... సామాజిక సేవ



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 21)

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని దేవాంగ నగర్‌కు చెందిన మంద్రు ప్రియాంక పుట్టినరోజు వేడుకలు బుధవారం వినూత్నంగా స్థానిక వాసవి వృద్ధుల ఆశ్రమంలో జరుపుకున్నారు. పుట్టినరోజు అనగానే కేకులు కటింగ్ చేసి, పార్టీలు చేసుకుంటారు. కానీ మంద్రు ప్రియాంక మాత్రం దానికి విరుద్ధంగా ఆశ్రమంలో వృద్ధులతో కొంత సమయం గడిపి వారికి బ్రేడ్, పండ్లు పంపిణీ చేసి యువతకు ఒక సందేశం అందించింది. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ నా పుట్టినరోజుని వృద్ధులతో కలిసి గడపాలనుకున్నాను. అందుకే వృద్ధుల ఆశ్రమంలో జరుపుకున్నానని అన్నారు. గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మంద్రు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పుట్టినరోజున సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప ఆలోచనని ప్రియాంక సేవలను కొనియాడారు. యువత పుట్టిన రోజున పార్టీల పేరుతో సమయాన్ని, డబ్బును వృథా చేయకుండా పుట్టినరోజు పార్టీలకు బదులుగా, సామాజిక సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఏదైనా సేవా సంస్థకు లేదా మీకు తెలిసిన ఏదైనా వ్యక్తికి సహాయం చేయవచ్చని యువతకు పిలుపునిచ్చారు. ప్రియాంక పుట్టిన రోజు వేడుకలు తెలుసుకున్న స్నేహితులు, బంధువులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు గుడ్ హెల్ప్ డైరెక్టర్ నాగవేణి పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యం

ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిన ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

పోలీసు సిబ్బంది, డ్రోన్ కెమెరాలు, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృతంగా తనిఖీలు

ఎవరైనా నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 21)



జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు, అసాంఘిక శక్తుల కదలికలను నిరోధించేందుకు కనిగిరి, పామూరు పట్టణం నందు, సింగరాయకొండ, కొండేపి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బందితో కలసి, ప్రత్యేక పోలీస్ బలగాలు స్పెషల్ పార్టీ, స్వాట్ టీం, డ్రోన్ కెమెరాలు, డాగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతమైన తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ముఖ్యమైన కూడళ్లలో, రహదారులపై వాహనాలు, పలు ఇళ్లల్లో, శివారు ప్రాంతాల్లో, పాత నేరస్తుల ఇళ్లలలో, చెడు నడతకలిగిన వారు, గంజాయి అక్రమ రవాణా, లాడ్జి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించారు. ఈ తనిఖీలో ప్రధాన ప్రదేశలలో వాహన తనిఖీలు చేసి సరైన లైసెన్స్, రిజిస్ట్రేషన్, పత్రాలు లేనివి, మాడిఫైడ్ సైలెన్సర్లు,ఇన్సూరెన్సు, నంబర్ ప్లేట్లు లేని, ఇర్రెగ్యులర్ నంబర్ ప్లేట్లు, త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలు, ఓవర్ స్పీడ్‌గా వెళ్తున్న మాడిఫైడ్ సైలెన్సర్‌లు ఉన్న ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్‌లకు పంపటం జరిగిందన్నారు. లాడ్జీలను, డార్మేట్స్ తనిఖీ చేసి,కొత్త వ్యక్తుల యొక్క వివరాలు ఆరా తీసి అనుమానిత వ్యక్తులని ప్రశ్నిస్తూ ఎటువంటి నేరాలు జరగకుండా జిల్లా పోలీసులు పటిష్టమైన నేర నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. పోలీస్ అధికారులు చెడునడత గల వారి యొక్క జీవనాధారం మరియు ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన యెడల చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా ,ప్రజల యొక్క భద్రతను కల్పించుటకు ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడం, అనుమానితులను తనిఖీ చేయటం, నేరాలను నియంత్రించడం విజిబుల్ పోలీసింగ్ ముఖ్య ఉద్దేశ్యమని ఎస్పీ గారు వివరించారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ కార్యకలాపాలను అడ్డుకట్ట వేయటం కొరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ ఎంతో సహాయపడుతుందని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ప్రజల భద్రత, నేర నియంత్రణ దృష్ట్యా ఈ తనిఖీలు నిర్వహించామని, చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100, 112 తెలియజేయాలని అక్కడి ప్రజలను కోరారు. ఈ తనిఖీలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, డిఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, నాగరాజు, రమణ కుమార్, శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐలు సుబ్బారావు, బీమా నాయక్, మల్లికార్జున, రామకోటయ్య, సురేష్, ప్రభాకర్, నాగరాజు, రామారావు, సోమశేఖర్, హాజరత్తయ్య, ఖాజావలి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## సూర్యలంక బీచ్‌ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలి

మడ మొక్కలకు ఆటంకం కలగకుండా పనులు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి





(షణ్ముఖ వెలుగు బ్యూరో, బాపట్ల, మే 21)

సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులలో మడ మొక్కలకు ఎటువంటి ఆటంకం కలగకుండా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. సూర్యలంక బీచ్‌ని సర్వాంగ సుందరంగా తయారు చేయడంలో అధికారులకు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి పలు సూచనలు చేశారు. స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద బీచ్ అభివృద్ధికి భారత ప్రభుత్వం 97.52 కోట్లు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. బీచ్ అభివృద్ధికి టూరిజం కార్పొరేషన్‌కు 25 ఎకరాల స్థలాన్ని కేటాయించడమైనదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బీచ్ లో చేపట్టే అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. అధికారులు బీచ్ లో చేపట్టే వివిధ పనులను జిల్లా కలెక్టర్ కు వివరించారు. బీచ్ అభివృద్ధిలో మడ మొక్కలకు ఎటువంటి ఆటంకం కలగకుండా పనులు చేపట్టాలని ఆయన అన్నారు. మడ అడవులు ఎక్కడ ఎక్కువగా ఉండవని ఆయన అన్నారు.మడ మొక్కల జాతి అణగారి పోతుందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన అన్నారు. ఈ మడ మొక్కలు సూర్యలంక బీచ్ నుండి నిజాంపట్నం వరకు విస్తరించి ఉన్నాయని ఆయన తెలిపారు. మడ అడవులను సందర్శించుట టూరిజం యొక్క ప్రత్యేకత అని ఆయన అన్నారు. మీరు ఏర్పాటు చేసిన జట్టిలో వెళ్తూ వారు ఆ మడ మొక్కలని తిలకిస్తారని, వాటి వలన పచ్చదనం ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. కాలువకు ఇరు ప్రక్కల మడ మొక్కల అభివృద్ధిలో అటవీశాఖ సహకారంతో జిల్లా కలెక్టర్ సూచనలతో పని చేయాలన్నారు. ఆ మడ అడవిలో గిరిజనులు చేపల వేట చేస్తారని ఆయన అన్నారు. బీచ్ అభివృద్ధిలో మడ మొక్కలను తొలగించేటటువంటి ఏ పనినైనా ఆపివేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డిఈ శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మహానాడుకు సైకిల్ యాత్ర చేస్తున్న కార్యకర్తను అభినందించిన కంభం మండల టీడీపీ నాయకులు

ఎన్నో సంవత్సరాలుగా సైకిల్ యాత్ర చేస్తున్న బాజీ



(షణ్ముఖ వెలుగు, కంభం, మే 21)

పిడుగురాళ్ల గుత్తి గ్రామనికి చెందిన షేక్ బాజీ తెలుగుదేశం పార్టీ పై తన అభిమానం చాటుకుంటున్నాడు. మహానాడుకు సైకిల్ యాత్ర చేస్తున్న బాజీ కంభం పట్టణం చేరుకొని అక్కడ



పార్టీ ఆఫీసు దగ్గరికి చేరుకోగా కార్యకర్త బాజీనీ అభినందించిన కంభం మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసులు గతంలో కూడా చాలాసార్లు సైకిల్ యాత్ర చేసి అందరి మన్నలను పొందడని తెలిపారు. ఈ నెల27,28,29 తేదీలలో కడపలో జరిగే మహానాడుకు సైకిల్ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు బాజీ. బుధవారం కంభం మండల చేరుకున్న బాజీని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు విషయం తెలుసుకొని అందరూ కలిసి కలిసి అభినందించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమలో కంభం మండలం నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు ఇద్దరు రైతులు అక్కడికక్కడే మృతి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 21)

మార్కాపురం మండలంలోని కోమటికుంట వద్ద (అమరావతి-అనంతపురం) జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న (టీవీఎస్ ఎక్సెల్) వాహనాన్ని వెనక నుండి కంభం వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మార్కాపురం మండలంలోని కొండేపల్లి గ్రామానికి చెందిన చాగంటి గాలిరెడ్డి (64), మండలంలోని వేములకోట పంచాయతీలోని వేముల పేట గ్రామానికి చెందిన జంకె శ్రీనివాసరెడ్డి (55)లు మృతి చెందారు. ఘటన స్థలానికి చేరుకున్న మార్కాపురం గ్రామీణ ఎస్సై అంకమ్మరావు, ఏఎస్ఐ లక్ష్మీ రంగయ్య, పోలీస్ సిబ్బంది మృతదేహాలను మార్కాపురం జీజీహెచ్‌కి తరలించారు.

## ఇంటి నివేశన స్థలాల దరఖాస్తుల పరిశీలన జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 21)



ఇంటి నివేశన స్థలాలకు ప్రజల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. రెవెన్యూ అంశాలపై రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి బుధవారం



వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో ఇంటి స్థలాలు కావాలని పేదల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి సమగ్ర నివేదికను ఆన్ లైన్ లో ఉంచాలని కలెక్టర్ కు సూచించారు. బాపట్లలో 50,484 ఫ్లాట్లు ఉండగా, అందులో 24,241 ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హుల జాబితా పరిశీలించాలన్నారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్డీవోలతో వీక్షణ సమావేశం ద్వారా జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడారు. బాపట్ల జిల్లాలో నమోదైన 22ఏ కేసుల వివరాలను తెలుసుకుని సంబంధిత దస్త్రాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. ప్రస్తుత 108 కేసులు గుర్తించగా వాటిని పరిశీలించి తక్షణమే పరిష్కరించాలన్నారు. పెండింగ్ కేసులు తక్షణమే పరిష్కరించాలన్నారు. 25 మండలాలలో రెవిన్యూ రికార్డ్ రూములు లేకపోతే తక్షణమే ప్రతిపాదనను పంపాలని ఆదేశించారు. ఇంటి స్థలం కావాలని వచ్చిన దరఖాస్తులు, అర్హులు, అనర్హులు, ప్రభుత్వ ఖాళీ భూములను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. మందస్తుగా ప్రభుత్వ ఖాళీ భూములను గుర్తించే ప్రక్రియకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. కాళీ ఫ్లాట్లపై క్షేత్రస్థాయి పరిశీలించిన అనంతరం నివేదికలో పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, సర్వే ల్యాండ్స్ ఏడి కనకరాజు, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డిఓలు గ్లోరియా, చంద్రశేఖర్ రామలక్ష్మి, కలెక్టరేట్ ఏవో సీతారత్నం, తదితరులు పాల్గొన్నారు.

## సీతారాములకు పూజలు చేసిన పీఠాధిపతి

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మే 21)



మండలం గొబ్బూరు గ్రామంలోని రామాలయం నందు శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధీశ్వరులు శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి కరకమల సంజాతులు శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి వారు. ఈ సందర్భంగా పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు ఆలయ అర్చకులు బాచి మంచి అరుణ కుమార్ శర్మ , భరద్వాజ శర్మలు, భక్తిశ్రద్ధలతో స్వామివారిని గ్రామస్తులు దర్శించుకున్నారు.

## అద్దంకి మినీ మహానాడుకు సర్వం సిద్ధం

**కార్యకర్తలందరూ మహానాడుకు హాజరు కావాలని మంత్రి గొట్టిపాటి పిలుపు**

**మహానాడు సందర్భంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 150 తోపుడు బండ్లు పంపిణీ**

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 21)



నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పండుగ (మినీ మహానాడు) అద్దంకిలో గురువారం ఉదయం 10 గంటలకు నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కళ్యాణ మండపంలో జరుగుతుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు. అన్న నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఈ ఏడాది కడపలో రాష్ట్ర స్థాయి మహానాడు నిర్వహించనున్నామని, ఇందులో భాగంగానే క్షేత్రస్థాయిలో కార్యకర్తలను భాగం చేసేలా నియోజకవర్గం స్థాయిలో ఈ మినీ మహానాడును ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పండుగలా జరుపుకునే ఈ మహానాడులో భాగంగా చిరు వ్యాపారులకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ 150 తోపుడు బండ్లను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. అంతేగాకుండా వివిధ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడి ఆసుపత్రుల బిల్లులతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 100 మందికి రూ. 60.55 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అందించనున్నారు.

# దళిత మంత్రి ఇలాకాలో రాజ్యాంగ నిర్మాతకు అవమానం

**అంబేద్కర్ జయంతి ఊరేగింపును**

**కె బిట్రగుంటలో అడ్డుకున్న అగ్రకుల కుల దురహంకారం**

**అంబేద్కర్ జయంతి ఊరేగింపును అడ్డుకున్న అగ్రకుల నిందితులను అరెస్టు చేయాలి**

**దళిత నేత నీలం డిమాండ్**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 21)

దళిత మంత్రి ఇలాకాలో రాజ్యాంగ నిర్మాతకు అవమానం జరిగింది. సాక్షాత్తు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండేపి నియోజకవర్గ జరుగుమల్లి మండలం కె బిట్రగుంట గ్రామంలో అంబేద్కర్ జయంతి నాడు దళితులు అంబేద్కర్ చిత్రపటంతో ఊరేగింపును నిర్వహిస్తుండగా అడ్డుకొని అంబేద్కర్ను అవమానించిన ఆ గ్రామ అగ్రకుల దుండగులను అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నేల నాగేంద్రరావు మాట్లాడుతూ అక్టోబర్ 12వ తేదీ జరుగుమల్లి మండలం కే బిట్రగుంట గ్రామంలో బుద్ధుని జయంతి సందర్భంగా బుద్ధుని చిత్రపటం ఊరేగింపుగా తీసుకెళుతున్న దళితులపై కూడా ఆ గ్రామ అగ్రకులస్తులైన కమ్మ, రెడ్డి కులస్తులు కొందరు అడ్డుకున్నారన్నారు. దళితులు ప్రత్యామ్నాయ సంస్కృతిలో భాగంగా బుద్ధుని జయంతిని జరపడం బుద్ధుని చిత్రపటంతో ఊరేగింపును చేయటం ఆ గ్రామ అగ్ర కులస్తులకు కంటగింపు అయిందన్నారు. ఈ క్రమంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి రోజు బిట్రగుంట దళితులు అంబేద్కర్ చిత్రపటంతో ఊరేగింపుగా వెళుతుండగా ఆ గ్రామానికి చెందిన అగ్రకుల దుండగులు అంబేద్కర్ చిత్రపటం ఊరేగింపును కూడా మరల అడ్డుకున్నారన్నారు. అంబేద్కర్ ఊరేగింపును మీ పల్లెలోనే జరుపుకోండి ఊర్లోకి రానివ్వం అంటూ అడ్డు తగిలారన్నారు. అధికార తెలుగుదేశం అండతో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటం ఊరేగింపును రహదారిపై అడ్డుకున్న ఘటనపై సింగరాయకొండ సిఐ అజరత్తయ్య పోలీస్ సిబ్బందితో వెళ్లి విచారించారన్నారు. అంబేద్కర్ ఊరేగింపును అడ్డుకోవడం మంచిది కాదని రోజులు మారాయని, కొత్త వచ్చాయని అగ్రకుల ఫ్యూడలిస్టుల్ని హెచ్చరించారు. కానీ అధికార తెలుగుదేశం ధీమాతో అగ్రకుల ఫ్యూడలిస్టులు మా వినాయక చవితి విగ్రహాన్ని పల్లెలోకి మేము తీసుకువెళ్లడం లేదు , కాబట్టి దళితులు కూడా అంబేద్కర్ ఊరేగింపును ఊర్లోకి తీసుకురాకూడదు అంటూ సింగరాయకొండ సిఐ తో వాగ్వాదానికి దిగారు. భారతదేశ విజ్ఞానజ్యోతి ప్రపంచ దేశాల్లో విగ్రహాలు ప్రతిష్టిస్తున్న కాలంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ను ఊర్లోకి రానివ్వమని అనాగరిక అగ్రకుల అహంభావం పై కూటమి ప్రభుత్వం స్పందించలేదు. పోలీస్ కేసులు నమోదు చేయలేదు. ఈ ఘటన మొత్తం సోషల్ మీడియాలో వైరల్ అయినా కూడా కూటమి ప్రభుత్వం స్పందించలేదు. సోషల్ మీడియాలో తమ కుటుంబ సభ్యులను అవమానించారని ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసి జైల్లో పెడుతున్న కూటమి ప్రభుత్వం అంబేద్కర్ కు జరిగిన అపచారంపై, అవమానంపై కేసులు నమోదు చేయకపోవడం కూటమి ప్రభుత్వ కొల వివక్షకు నిదర్శనం అన్నారు. సామాజిక న్యాయం అంబేద్కర్, ఫూలే, చేగువేరా, మార్గదర్శకం అన్న సనాతన స్టార్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కె బిట్రగుంట లో అంబేద్కర్ కు జరిగిన అవమానంపై స్పందించాలన్నారు. అక్టోబర్ 12వ తేదీ బుద్ధుని చిత్రపటం ఊరేగింపును, ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి ఊరేగింపు చిత్రపట ఊరేగింపును అడ్డుకున్న ఘటనపై ఏప్రిల్ 29వ తేదీ మద్దిరాల జగదీష్ , కొంతమంది పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. కానీ నెల రోజులు కావస్తున్న ఈ రోజుకు కూడా జరుగుమల్లి పోలీస్ స్టేషన్లో బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలను అడ్డుకున్న బత్తుల శేషారెడ్డి, మామిడిపల్లి శ్రీను, తదితర అగ్రకుల నిందితులపై కేసు నమోదు చేయలేదన్నారు. దళితులు న్యాయం కోసం ధర్నాలు రాష్ట్ర రోకోలు చేస్తే ఎవరి ఫిర్యాదు లేకుండానే సొంతగా కేసులు కట్టే పోలీస్ అధికారులు దళితులు ఫిర్యాదు చేసిన కేసు ఎందుకు కట్టలేదో చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఎస్సీ ఎస్టీ కేసు కట్టి కే బిట్రగుంట అగ్రకుల దుహంకారులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి బిట్రగుంట గ్రామాన్ని సందర్శించి బాధిత దళితులకు అండగా నిలబడి అంబేద్కర్ పట్ల అంబేద్కర్ కు జరిగిన అవమానాన్ని సరిదిద్దాలని నేలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, తానికొండ ఆనంద్ తదితరులు ఉన్నారు.






# యోగా అందరి జీవితాల్లో భాగం కావాలి

**గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి**







(షణ్ముఖ వెలుగు బ్యూరో, బాపట్ల, మే 21)

యోగా అందరి జీవితాల్లో భాగం కావాలని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం, స్థానిక పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర క్యాంపెయిన్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్,జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు, పర్చూరు శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావు, చీరాల శాసనసభ్యులు ఎం ఎం కొండయ్య పాల్గొని యోగ గురువు పతంజలి చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 69వ సమావేశంలో 2014 సెప్టెంబర్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ దినోత్సవం జరపాల్సిందిగా ప్రతిపాదించారని ఆయన తెలిపారు. ఈ ప్రతిపాదనను 177 దేశాలు ఆమోదించడం జరిగిందన్నారు. 2015 సంవత్సరం నుంచి ప్రతి ఏటా జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. యోగా వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల పై ఈ రోజు నుంచి నెల రోజుల పాటు విస్తృతంగా అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. జూన్ 21వ తేదీన వైజాగ్లో 5 లక్షల మందితో జరిగే యోగా కార్యక్రమంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా ప్రయోజనాలు పొందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్ ను ప్రారంభిస్తూ, ఈరోజు యోగాంధ్ర- కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించుకుంటు న్నామన్నారు. పాఠశాలల్లో, కళాశాలలో, యూనివర్సిటీ లలో యోగా కు సంబంధించిన పోటీలు, నిర్వహించబడతాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా వలన శారీరక, మానసిక ధైర్యం వస్తుందని అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ కృషి వలన మనందరం అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21వ తేదీన నిర్వహించుకుం టున్నామని ఆయన అన్నారు. మొదటిగా ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2015లో గుజరాత్ లో ఒక లక్ష 53 వేల మందితో యోగా దినోత్సవం నిర్వహించడమైనదని, ఇది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో నిలిచిందని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జూన్ 26వ తేదీన ప్రధానమంత్రి గారితో విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదు లక్షల మందితో నిర్వహిస్తున్నారని అన్నారు. కర్టెన్ రైజర్ ద్వారా ఈరోజు నుండి జూన్ 21వ తేదీ వరకు 30 రోజులు ఈ కార్యక్రమం మండల, గ్రామ, జిల్లా స్థాయిలో జరుపుతారని ఆయన తెలిపారు.

ఈ రోజు మనందరం జిల్లాలోని 17 లక్షల మందికి చేరే విధంగా ఒక ప్రణాళిక చేసుకున్నామన్నారు. జూన్ 21వ తేదీన సూర్యలంక, రామాపురం బీచ్లో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి జీవన శైలిలో యోగా ఒకటిగా చేర్చుకోవాలని ఆయన తెలిపారు. యోగా వలన శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉంటామని ఆయన తెలిపారు. యోగా వలన జాయింట్స్ పెయింట్స్ దరిదాపులు రావని అన్నారు. యోగా వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, ప్రజలందరూ యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగ స్వాములు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులచే యోగాసనాలు అభ్యాసం చేయించారు. మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, ప్రజలు, పాఠశాల, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని యోగాసనాలు వేశారు.

# అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



**జెడ్ ఉప్పలపాడులో సీతారాముల కళ్యాణోత్సవ వేడుక**

**తిలకించేందుకు తరలివచ్చిన ప్రజలు**

**హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి,**

**ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, నాయకులు**

(షణ్ముఖ వెలుగు, వలేటివారిపాలెం, మే 21)

మండలంలోని జెడ్ ఉప్పలపాడులో సీతా రాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. రామాలయంలో నిర్వహించిన వేడుకలో భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు, టిడిపి సీనియర్ నాయకుడు రవీంద్ర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి అక్షింతలు, తీర్థ ప్రసాదలను అందజేశారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com